Follow: @ANNTELUGU
ANN తెలుగు
24-07-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 201 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



విద్యార్థులకు ఇండి కూటమి
## సంపూర్ణ మద్దతు
- రాహుల్ గాంధీ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఒత్తిడి పెంచుతున్న విపక్షాలు.
- ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత

02



టాప్ న్యూస్

## 'ఏపీ అస్త్రం' ఆవిష్కరణ


- భవిష్యత్ పోలీసింగ్‌పై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- డిజిటల్ లిటరసీతో ఆధునిక పోలీసింగ్ లక్ష్యంగా ముందడుగు.

03

సీఎం రేవంత్‌రెడ్డికి
## లీగల్ నోటీసు పంపిన కేటీఆర్


- క్షమాపణ చెప్పాలని డిమాండ్
- గ్లోబ్ ఏరినా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ అని పేర్కొన్న సీఎం

02

## ఇరాన్ పై తీవ్ర దాడులకు ట్రంప్ ప్లాన్


- తుది నిర్ణయానికి దగ్గరలో ఉన్నట్లు వ్యాఖ్యలు.

03

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరని
# బీఆర్ఎస్ ఎందుకు?

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి: సీఎం రేవంత్ రెడ్డి



గ్లోబరీనా, కాళేశ్వరం, ఇంటర్ విద్యార్థుల మరణాలపై బీఆర్ఎస్‌ను నిలదీసిన సీఎం.

ఓటరు ప్రక్షాళన, ఉద్యోగాలు, ధర్నాచౌక్‌పై విస్తృత వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆ పార్టీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించిన సీఎం, తమ హయాంలో ఇంటర్ మూల్యాంకన లోపాల కారణంగా 27 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో సీఎం బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు గుప్పిస్తూ పలు రాజకీయ అంశాలపై స్పందించారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారాన్ని ప్రస్తావించిన రేవంత్ రెడ్డి, ఆ సంస్థ కేటీఆర్ బినామీ కంపెనీ కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. పరువు ఉన్నవాడే పరువు నష్టం దావా వేస్తాడని వ్యాఖ్యానిస్తూ, గ్లోబరీనా వ్యవహారంలో నిజాలు ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. **మిగతా 2వ పేజీలో**

**అన్నోజిగూడలో అరాచకం ఎపిసోడ్- 4**

# బాలరాజు గౌడ్ బండారం బట్టబయలు..!



**సర్వే నంబర్ 92లో మాయాజాలం..!**

- జీపీ లేఅవుట్‌లోని 40 ఫీట్ల రోడ్డును మింగిన అక్రమార్కుడు..!
- తీగ లాగితే డొంక కదులుతున్న వైనం..!
- లంచాల మత్తులో కళ్లుమూసుకుని రోడ్డును సైతం రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్..!
- బాలరాజు గౌడ్ అక్రమాలు అంతా ఇంతా కాదయ్యా..!
- బ్యాంకులకు వందల కోట్ల ఎగవేత..
- ఐటీ, ఈడీ, ఏసీబీ దృష్టి సారించాలంటున్న స్థానికులు..!
- బ్యాంకులను సైతం తన కనుసన్నల్లోనే శాసిస్తున్న అక్రమార్కుడు..!
- ఆర్బీఐ రంగప్రవేశం చేస్తేనే వాస్తవాలు బట్టబయలు..!

02



అన్నోజిగూడలో మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజు గౌడ్ అరాచకాలపై రోజుకో వివాదం వెలుగులోకి వస్తోంది. నవ్విపోదురు గాక నాకేమి సిగ్గు అన్న చందంగా తయారైంది ఇతని అరాచకాలు. ఒకటి కాదు రెండు కాదు, తీగ లాగితే డొంక కదిలినట్లు బాలారాజు గౌడ్ బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. అతని ఆగడాలు అన్నీ ఇన్నీ కావని స్థానికులు పేర్కొంటున్నారు.స్వాదీనంలో లేని, కేవలం పహాణీల్లో పేరు ఉన్న అమాయక రైతులను మభ్యపెట్టి ఆ డాక్యుమెంట్లను తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుని, స్వాదీనంలో లేని ఇతరుల భూములను చూపించి వందల కోట్ల రుణాలను బ్యాంకుల నుండి పొంది ఆపై బ్యాంకులకే శటగోపం పెట్టినట్లు బ్యాంకు అధికారులు జారీ చేసిన బహిరంగ వేలం ద్వారా బహిర్గతం అవుతోంది. నిబంధనలకు పాతరేసి.. ప్రజా హక్కులను కాలరాస్తూ ప్రజా రహదారులను సైతం ఆక్రమించి అన్నోజిగూడలో సాగుతున్న ఈ 'భూ' దందా పరాకాష్టకు చేరిందనే ఆరోపణలు బహిరంగంగానే వ్యక్తమవుతున్నాయి.



## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం


- కేసీఆర్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకూ ప్రాధాన్యం.
- ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు.

02

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఉద్యోగాల భర్తీపై మరింత అధ్యయనం.
- నేతన్న భరోసాకు ఆమోదం.
- పుష్కరాలకు రూ.50 కోట్లు.
- ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచన.

03

## సీజేపీ ఉద్యమం మరింత ఉధృతం
- నేడు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై వెనక్కి తగ్గేదిలేదన్న విద్యార్థి నేతలు
- ఢిల్లీ హైకోర్టులో పిటిషన్లు
- స్పందించిన ప్రధాని మోదీ

03



## జంతర్‌మంతర్ ఆందోళనల వెనుక రాజకీయ ప్రేరేపణ
- నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం కఠిన చర్యలు తీసుకుంది.
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

02

## నీట్ ఉద్యమానికి అండగా ఇండియా కూటమి
- ఢిల్లీలో ఉద్రిక్తత.
- రాహుల్ గాంధీ నివాసం నుంచి రాజ్‌ఘాట్‌కు ర్యాలీకి యత్నం.
- ఎంపీల బస్సును అడ్డుకున్న పోలీసులు



03



# బాలరాజు గౌడ్ బండారం బట్టబయలు..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ మండలం, అన్నోజిగూడలో మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజు గౌడ్ వ్యవహారాలపై రోజురోజుకూ కొత్త ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. అమాయక రైతుల భూముల కొనుగోళ్లు, అక్రమ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, ప్రజా రహదారుల ఆక్రమణలు వంటి అంశాల్లో లోతుగా పరిశీలిస్తే మరిన్ని సంచలన విషయాలు బయటపడే అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సర్వే నంబర్ 92 లోని గ్రామపంచాయతీ ఆమోదించిన జీపీ లేఅవుట్ లో 40 ఫీట్ల ప్రజా రహదారికి సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
వివరాలలోకి వెళితే బాలగోని రాజయ్యకు మొత్తం ఐదుగురు కుమారులు. వారు బాలగోని పెద్ద నర్సింహా గౌడ్, దశరథ గౌడ్, ఆంజనేయులు గౌడ్, శంకరయ్య గౌడ్, రమేష్ గౌడ్. వీరందరూ కలిసి 1987వ సంవత్సరంలో బాలగోని పెద్ద నర్సింహా గౌడ్‌కు 7.20 ఎకరాల భూమికి గాను జిపిఏ ఇచ్చారు.
అయితే బాలగోని పెద్ద నర్సింహా గౌడ్ 132 ప్లాట్లతో జీపీ లేఅవుట్‌ను అభివృద్ధి చేసి వెంచర్ ఏర్పాటు చేసినట్లు గ్రామ పంచాయతీకి అందచేసిన రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ లేఅవుట్ లో 40 అడుగుల ప్రధాన రహదారితో పాటు 25 అడుగుల రహదారులు ఉన్నట్లు చూపిస్తూ, అప్పట్లోనే సుమారు 100 కు పైగా ప్లాట్లను విక్రయించారు. ఆ లేఅవుట్ లోని 40 అడుగుల ప్రధాన రహదారిని చూపించడమే కాకుండా, రిజిస్ట్రేషన్ సమయంలో ప్రతి ప్లాట్ సరిహద్దుల్లోనూ "40 ఫీట్ల



1988 సంవత్సరం లో బాలగోని రాజయ్య చేసిన రిజిస్ట్రేషన్ (డాక్యుమెంట్ నెంబర్: 2931/88)

రోడ్డు" అని స్పష్టంగా నమోదు చేసినట్లు రికార్డులు తేటతెల్లం చేస్తున్నాయి.

**100కు పైగా ప్లాట్లు అమ్మి.. రోడ్డునే మాజీ రౌడీషీటర్‌కు రిజిస్ట్రేషన్ చేసిన వైనం..!**

బాలగోని పెద్ద నర్సింహా గౌడ్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు 1988లో గ్రామపంచాయతీ ఆమోదించిన లేఅవుట్ లో 40 ఫీట్ల రహదారిని స్పష్టంగా చూపిస్తూ వెంచర్‌ను అభివృద్ధి చేసి విక్రయించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అదే విధంగా 100కు పైగా ప్లాట్ల విక్రయాల సందర్భంగా జరిగిన రిజిస్ట్రేషన్లలో కూడా ప్లాట్ల సరిహద్దుల వద్ద 40 ఫీట్ల రహదారి ఉన్నట్లు స్పష్టంగా రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లను బట్టి తెలుస్తుంది.
అయితే ప్రస్తుతం అదే రహదారి వెడల్పు 25 ఫీట్లు మాత్రమేనంటూ పేర్కొంటూ, మిగిలిన విస్తీర్ణంగా చెప్పబడుతున్న 2,334 చదరపు గజాల భూమిని కొట్టివేసేందుకు సదరు గ్యాంగు కుయుక్తులు పన్ని మాజీ రౌడీషీటర్ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. లేఅవుట్ ఆమోదం, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, ప్రజా రహదారి హక్కులు అన్నీ 40 ఫీట్ల రహదారినే సూచిస్తుండగా, అనంతరం దానిని 25 ఫీట్ల రహదారిగా పేర్కొని రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయన్న అంశంపై లేఔట్ లో ప్లాట్లు కొనుగోలు



**పహాణీల్లో పేర్లు...**
**అమాయకుల భూములపై కన్ను!**
స్థానికుల కథనం ప్రకారం, భౌతిక స్వాధీనం లేని భూములు, కేవలం పహాణీల్లో మాత్రమే పేర్లు ఉన్న భూములను లక్ష్యంగా చేసుకుని అమాయక రైతులను మభ్యపెట్టి, అనంతరం వాటిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, అసలు స్థితిగతులు వేరుగా ఉన్నప్పటికీ విలువైన ఆస్తులుగా చూపిస్తూ భారీ ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు చెబుతున్నారు.



సర్వే నెంబర్ 92 లో 40 ఫీట్ల రోడ్డును సూచిస్తూ 1988 లో ఏర్పాటు చేసిన జి. పి. లే అవుట్

చేసిన యజమానులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.
ప్రజలందరికీ ఉపయోగపడే సాధారణ రహదారిని వ్యక్తిగత ఆస్తిగా మార్చుకున్న ఈ అక్రమ వ్యవహారంలో అప్పటి స్థానిక సబ్‌రిజిస్ట్రార్ దొంగలకు సద్ది కట్టారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
దశాబ్దాలుగా ఎలాంటి వివాదాలు లేనప్పటికీ, ఈ లేఅవుట్ లో అసలు కథ ఇప్పుడే మొదలైంది. ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులను తీవ్ర భయాందోళనలకు, ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతోనే బాలగోని బాలరాజు గౌడ్ ఈ రకమైన కుట్రలు, పన్నాగాలు పన్నాడని స్థానిక పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

**వందల కోట్ల బ్యాంకు రుణాల కుంభకోణం?**

భౌతిక స్వాధీనం లేని భూములను, వివాదాస్పద ఆస్తులను సైతం తనఖా పెట్టి వివిధ బ్యాంకుల నుంచి భారీ రుణాలు పొందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రుణాల మంజూరు సమయంలో బ్యాంకులు చేసిన పరిశీలన, సమర్పించిన పత్రాల ప్రామాణికత, ఆస్తుల అసలు స్వరూపం వంటి అంశాలపై సమగ్ర విచారణ అవసరమని వారు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో వందల కోట్ల రూపాయల రుణాల మాయాజాలం దాగి ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పాత్రపై ప్రశ్నల వర్షం**

జీపీ లేఅవుట్ లో ప్రజా రహదారిగా ఉన్న భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది. లేఅవుట్ లో స్పష్టంగా రహదారి చూపించినప్పటికీ, సంబంధిత రిజిస్ట్రేషన్లు ఏ ఆధారాలతో జరిగాయన్న అంశంపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల పాత్రపైనా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఐటీ, ఈడీ, ఏసీబీ, ఆర్బీఐ జోక్యం కోరుతున్న స్థానికులు:**

భూముల కొనుగోళ్లు, అక్రమ రిజిస్ట్రేషన్లు, బోగస్ బ్యాంకు రుణాలు, అక్రమ ఆర్థిక లావాదేవీలపై కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



40 ఫీట్ల రోడ్డును 25 ఫీట్ల రోడ్డుగా చూపిస్తూ 2334 చదరపు గజాల రోడ్డు అక్రమ రిజిస్ట్రేషన్

ఆదాయపు పన్ను శాఖ,
**ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్,**
అవినీతి నిరోధక శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ సంస్థలన్నీ రంగంలోకి దిగి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి బ్యాంకు రుణాల మంజూరు నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వరకు పూర్తి స్థాయిలో విచారణ జరిపితేనే అసలు వాస్తవాలు, ఈ రుణాల మంజూరు వెనుక దాగున్న అక్రమ అధికారుల పాత్ర కూడా బహిర్గతం అవుతుందని బాధితులు, స్థానికులు పేర్కొంటున్నారు .సర్వే నంబర్ 92 వ్యవహారం ప్రస్తుతం సాధారణ భూ వివాదాన్ని దాటి ప్రజా రహదారుల పరిరక్షణ, రిజిస్ట్రేషన్ వ్యవస్థ పారదర్శకత, బ్యాంకింగ్ నిబంధనల అమలు వంటి అనేక తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరని బీఆర్ఎస్ ఎందుకు?

( మొదటి పేజీ తరువాయి )
జన్వాడ ఫామ్‌హౌస్‌లో ఉన్న భూములు ఎవరివో కూడా కేటీఆర్ ప్రజలకు వివరించాలని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతను పూర్తిగా విస్మరించి వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం ఆరోపించారు. ఈ కారణంగానే హరీశ్‌రావును కేసీఆర్ మంత్రివర్గం నుంచి పక్కన పెట్టారని వ్యాఖ్యానించారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్నవారే ఇప్పుడు త్యాగాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రక్తదానం చేశామని చెప్పుకునే నాయకులు ఆ రక్తాన్ని ఎవరికి అమ్ముకున్నారో చెప్పాలని ఎద్దేవా చేశారు.
బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇవ్వాల్సిన ఇళ్లను దళారులకు అమ్ముకుందని ఆరోపించిన సీఎం, ఉద్యోగాల విషయంలో కూడా ఆ పార్టీ నిరాధార విమర్శలు చేస్తోందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ నియామకాలపై ప్రశ్నించాలని, పేర్లతో సహా పూర్తి జాబితాను సభ ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత వేగంగా కేవలం 55 రోజుల్లో 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేసి దానిని ఆదాయ మార్గంగా మార్చుకోవడం గత ప్రభుత్వాల పని అని పరోక్షంగా బీఆర్ఎస్‌ను విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరిస్తూ ధర్నాచౌక్‌ను తిరిగి ప్రారంభించామని సీఎం గుర్తుచేశారు. గతంలో మూసివేసిన ధర్నాచౌక్‌ను తెరిచింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు అదే ధర్నాచౌక్‌లో కేటీఆర్ ధర్నా చేస్తాననని చెప్పడం రాజకీయ విరుద్ధతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర బీజేపీలో కూడా అంతర్గత విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ



పై స్పందించిన రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో ప్రస్తుతం 70 శాతం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 30 శాతం కూడా త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకులకు సూచించినట్లు తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ఓట్లు లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. చిన్న చిన్న సాంకేతిక లోపాలను ఓటరు తొలగింపుగా చిత్రీకరించడం సరికాదన్నారు. తనకు రెండు ఓట్లు ఉన్నాయని ఎవరైనా నిరూపిస్తే ఫిర్యాదు చేయాలని, తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో వేలాది మంది ఆంధ్ర ప్రాంత ప్రజల ఓట్లు తొలగించారని, అప్పట్లో కాంగ్రెస్ కోర్టును ఆశ్రయించడంతో నాటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. తన ఓటును చట్టబద్ధంగా బదిలీ చేయించుకున్నానని, దాని కోసం కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించినట్లు చెప్పారు. ఒకప్పుడు కొడంగల్ కర్ణాటకలో భాగంగా ఉండేదని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో తెలంగాణలో కలిసిందని వివరించారు. బీఎల్‌వోలకు అనుసంధానంగా బీఎల్ఏలను నియమించి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
రాష్ట్రంలో హైడ్రా సమర్థంగా పనిచేస్తోందని, అక్రమ నిర్మాణాలు, ఆక్రమిత ఆస్తుల స్వాధీన ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తెలంగాణలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే సంస్థల పేర్లను రాష్ట్ర రహదారులకు పెట్టేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆహార కల్తీపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా కేటీఆర్ 50 వేల మెజార్టీతో గెలుస్తామని చెప్పగా, కాంగ్రెస్ 30 వేల మెజార్టీతో విజయం సాధిస్తుందని తాను అప్పుడే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.
అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో జరుగుతున్న మరమ్మతులు, పునరుద్ధరణ పనులను పరిశీలించారు. శాసనసభ ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జంతర్‌మంతర్ ఆందోళనల వెనుక రాజకీయ ప్రేరేపణ.

- **నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం కఠిన చర్యలు తీసుకుంది.**
- **కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి**

**ఢిల్లీ, మహా :** దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్‌తో పాటు వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ పరిణామాల వెనుక రాజకీయ ప్రేరేపణ ఉందని ఆరోపించారు. గతంలో షాహీన్‌బాగ్ ఆందోళనల్లో పాల్గొన్న వర్గాలే ఈ నిరసనల వెనుక ఉన్నట్లు తమకు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు పాల్పడిన వారిని కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసి జైలుకు పంపిందని కిషన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం మరోసారి నీట్ పరీక్షను నిర్వహించిందని చెప్పారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు 2024లో ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టే కఠిన చట్టాన్ని కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు.



జంతర్‌మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలను కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవాలని చూస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపర్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. గతంలో ప్రశ్నాపత్రాల లీకేజీలు జరిగినప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎప్పుడైనా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా పలు పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయిన ఘటనలను కాంగ్రెస్ నేతలు గుర్తు చేసుకోవాలని సూచించారు.
కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకుని ప్రధాని నివాసం ముందు ధర్నాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నేతలను నిలదీశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడే వారిపై ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారణ జరిపి మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు.
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పదో తరగతి ప్రశ్నాపత్రం లీక్ ఘటన చోటుచేసుకుందని పేర్కొన్న ఆయన, అప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. "చలో రాజ్‌భవన్" వంటి కార్యక్రమాలు నిర్వహించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు. విద్యార్థుల సంక్షేమంపై కాంగ్రెస్‌కు నిజమైన చిత్తశుద్ధి లేదని, వారి పేరుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపిన కేటీఆర్

- **క్షమాపణ చెప్పాలని డిమాండ్**
- **గ్లోబ్ ఏరినా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ అని పేర్కొన్న సీఎం**

**హైదరాబాద్, మహా :** గ్లోబరీనా తన బినామీ సంస్థ అంటూ వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లీగల్ నోటీసులు పంపినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. రేవంత్ రెడ్డి సమాధానం ఇవ్వకపోతే న్యాయపరంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. గ్లోబరీనా సంస్థపై తనపై సీబీఐ, సీఐడీ, ఎఫ్‌బీఐతో విచారణ చేయిస్తే తాను సంపూర్ణంగా సహకరిస్తానని సంస్థ తనదేనని నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. లేదంటే సీఎంకు తనకు లైడిటెక్టర్ కూడా సిద్ధమేనన్నారు. ఒకవేళ సంస్థ తనదే అయితే మరి రేవంత్ సర్కారు గ్లోబరీనాతో ఎందుకు ఒప్పందం చేసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. హన్మకొండలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చిట్ చాట్‌లో పలు అంశాలపై మాట్లాడారు. దేశ రాజధానిలో యువత చేస్తున్న ఉద్యమం తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తుందని కేటీఆర్ తెలిపారు. నాయకుడు లేకుండానే యువత స్ఫూర్తివంతమైన ఉద్యమం చేస్తుందన్నారు. దిల్లీ ఉద్యమంతో మోదీ ప్రభుత్వం అతిపెద్ద సవాల్ ఎదుర్కొంటోందన్న కేటీఆర్ బీజేపీ ప్రభుత్వం ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే పెట్టుకుందని తెలిపారు. మోదీపై యువత తీవ్ర వ్యతిరేకత, అసహనంతో ఉన్నారని అన్నారు. బీజేపీ పతనానికి నాంది పడిందని మోదీని దేవుడు అన్నోళ్లే తిరుగుబాటు చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.

# 'ఏపీ అస్త్రం' ఆవిష్కరణ

**భవిష్యత్ పోలీసింగ్‌పై**
**సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

**అమరావతి, మహా** ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీసులు రూపొందించిన 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. విజయవాడలోని అంబేడ్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన 'ఏపీ పోలీస్ రిట్రీట్ 2026: ఫ్యూచర్ పోలీసింగ్' కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్‌లో టెక్నాలజీ వినియోగం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. కేవలం టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థ నిర్మాణాన్నే పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.భవిష్యత్ పోలీసింగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.

# విద్యార్థులకు ఇండి కూటమి సంపూర్ణ మద్దతు.

**ఢిల్లీ, మహా :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఇండి కూటమి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఇండి కూటమి ఎంపీలతో సమావేశమైన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. అనంతరం నేతలంతా గాంధీ స్మృతివనం వద్దకు వెళ్లేందుకు బస్సులో బయలుదేరగా, మార్గమధ్యంలో పోలీసులు బస్సును నిలిపివేశారు .ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళులర్పించేందుకు గాంధీ స్మృతివనం వెళ్లాలని నిర్ణయించామని తెలిపారు. తొలుత ఇండియా గేట్ వద్ద కార్యక్రమం నిర్వహించాలని భావించినప్పటికీ, పోలీసులు అనుమతి నిరాకరించారని చెప్పారు. విద్యార్థులు ఒంటరివారు కాదని, వారి పోరాటానికి ఇండి కూటమి సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ గాంధీ నివాసం పరిసరాల్లో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ నేతలు చేపట్టిన ఆకస్మిక ధర్నా నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం.జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసంతో పాటు కేంద్ర మంత్రుల ఇళ్ల వద్ద కూడా భద్రతను పెంచారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నివాసం వద్ద భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు, ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంటూ ఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ అత్యవసర అడ్వైజరీ జారీ చేసింది. గురువారం సాయంత్రం 6.30 గంటల నుంచి దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని వ్యాపారులకు సూచించింది. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ అడ్వైజరీపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ, విద్యార్థులపై మరోసారి కఠిన చర్యలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోందా అంటూ ప్రశ్నించారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గత 16 రోజులుగా వివిధ ఉద్యమ సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు నిర్వహించినట్లు వెల్లడించారు.ఉద్యమకారులను ఏ ప్రాతిపదికన గుర్తించాలి, వారికి ఎలాంటి గౌరవం కల్పించాలి అనే అంశాలపై అన్ని రాజకీయ పార్టీల నుంచి విలువైన సూచనలు స్వీకరించినట్లు కేశవరావు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అన్ని పార్టీలు స్వాగతించాయని పేర్కొన్నారు. వివిధ సంఘాల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక రూపంలో సమర్పిస్తామని స్పష్టం చేశారు.ఈ సంప్రదింపుల సమావేశాలకు సుమారు 13 వేల మంది హాజరయ్యారని, దాదాపు వెయ్యి మంది తమ సూచనలు లిఖితపూర్వకంగా అందజేశారని ఆయన వెల్లడించారు. అయితే సంప్రదింపుల ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, ఆన్‌లైన్ ద్వారా కూడా ఉద్యమకారులు, సంఘాల అభిప్రాయాలు స్వీకరించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటించి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. తెలంగాణ



ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం దక్కేలా కమిటీ బాధ్యతాయుతంగా పనిచేస్తుందని కేశవరావు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, త్వరలోనే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటించి ఉద్యమకారులు, సంఘాలతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును గౌరవిస్తామని, ఆయన్ను కూడా ఈ చర్చలకు ఆహ్వానిస్తామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పనిచేసిన అప్పటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కూడా సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకుంటామని వెల్లడించారు. డిసెంబర్‌లోపు కమిటీ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అద్దంకి దయాకర్ తెలిపారు.

## నీట్ ఉద్యమానికి అండగా ఇండియా కూటమి

- ఢిల్లీలో ఉద్రిక్తత
- రాహుల్ గాంధీ నివాసం నుంచి రాజ్‌ఘాట్‌కు ర్యాలీకి యత్నం.
- ఎంపీల బస్సును అడ్డుకున్న పోలీసులు

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఆందోళనలు కొనసాగుతున్న వేళ, విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా ఇండియా కూటమి రంగంలోకి దిగింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసంలో గురువారం అత్యవసరంగా సమావేశమైన ఇండియా కూటమి ఎంపీలు, నీట్ పేపర్ లీకేజీ, సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యార్థుల నిరసనలు, తదుపరి కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలేతో పాటు పలు విపక్ష పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు హాజరయ్యారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన కూటమి నేతలు, నీట్ పేపర్ లీకేజీతో మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థులకు నివాళులర్పించేందుకు రాజ్‌ఘాట్‌లోని గాంధీ స్మృతిని సందర్శించాలని నిర్ణయించారు.సమావేశం అనంతరం రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష ఎంపీలు, నేతలంతా ఒకే బస్సులో రాజ్‌ఘాట్‌కు ర్యాలీగా బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి బస్సును అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ మధ్యలోనే వాహనాన్ని వదిలి వెళ్లిపోవడం మరింత కలకలం రేపింది. పోలీసులు తమను ఇండియా గేట్‌కు వెళ్లనివ్వలేదని, ఇప్పుడు రాజ్‌ఘాట్‌కు వెళ్లడానికీ అడ్డుకుంటున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం ప్రతిపక్ష ఎంపీలంతా అవసరమైతే రోడ్లపైకి వచ్చి పోరాడతామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీతో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళులర్పించడమే కాకుండా, ఆందోళనల సందర్భంగా లాఠీచార్జ్‌లో గాయపడిన విద్యార్థులకు సంఘీభావం ప్రకటించేందుకే రాజ్‌ఘాట్‌కు వెళ్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎప్పటికీ ఒంటరివారు కాదని, వారి న్యాయమైన డిమాండ్లకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా కూడా వెల్లడిస్తూ, విద్యార్థుల గొంతుకు అండగా నిలబడటం తమ బాధ్యత అని పేర్కొన్నారు.మరోవైపు జంతర్‌మంతర్ ప్రాంతంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. సాయంత్రం 6.30 గంటల నుంచే హోటళ్లు, దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయాయి. భారీ సంఖ్యలో విద్యార్థులు, నిరసనకారులు జంతర్‌మంతర్‌కు చేరుకోవడంతో పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. పోలీసుల వైఖరిపై సీజేపీ నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, పరిస్థితిని అదుపులో ఉంచేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు.ఇదిలా ఉండగా, అమిత్ షా నివాసాన్ని కూడా ముట్టడించేందుకు ఇండియా కూటమి ప్రణాళిక సిద్ధం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద నిర్వహించిన మెరుపు ధర్నా తరహాలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇంటి ఎదుట కూడా నిరసన చేపట్టే అవకాశాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ నివాసం పరిసరాల్లో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేసి, బారికేడ్లు ఏర్పాటు చేశారు.

పోలీసుల మోహరింపుపై కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి తీవ్రంగా స్పందించారు. పోలీసులను చూపించి తమను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని, కానీ ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం ఆపబోమని అన్నారు. తాము దేశంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు కలిగిన ప్రజాప్రతినిధులమని స్పష్టం చేశారు.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, విద్యార్థుల ఆందోళనలు, విపక్షాల నిరసనలతో జాతీయ రాజధాని ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తత రోజురోజుకూ పెరుగుతోంది. విద్యార్థుల ఉద్యమానికి పూర్తి మద్దతుగా ఇండియా కూటమి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఎర్రచందనం మాఫియాను మూలాలతో సహా నిర్మూలించాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- డ్రోన్లు, అత్యాధునిక సాంకేతికతతో నిఘా పటిష్టం చేయాలి.
- స్మగ్లర్లతో పాటు కింగ్‌పిన్‌లు, ఫైనాన్షియర్లపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం.



**అమరావతి, మహా :** రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు అటవీ శాఖ మరింత దూకుడుగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. డ్రోన్ సాంకేతికతతో పాటు అత్యాధునిక నిఘా వ్యవస్థలను వినియోగించి స్మగ్లింగ్ ముఠాల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. స్మగ్లర్లతో పాటు వారి వెనుక ఉన్న కింగ్‌పిన్‌లు, ఫైనాన్షియర్లపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, గత రెండేళ్లలో సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

సమీక్షలో అధికారులు అందించిన వివరాల ప్రకారం గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై 506 కేసులు నమోదు చేసి, 1,239 మంది నిందితులను అరెస్టు చేశారు. 372 వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడులో అక్రమంగా నిల్వ చేసిన 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో కన్విక్షన్ రేటు మూడు శాతం కంటే తక్కువగా ఉండేదని, ప్రస్తుతం 95 శాతం కేసుల్లో నిందితులకు శిక్షలు పడే స్థాయికి అది పెరిగిందని అధికారులు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్మగ్లర్లపై పీడీ చట్టం అమలు చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే 12 మంది ప్రధాన స్మగ్లర్లపై ఆ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైన అటవీ సంపద ఎర్రచందనమని, దానిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడైనా ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నట్లు సమాచారం అందితే సంబంధిత రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

స్మగ్లింగ్ ముఠాల్లో పనిచేసే వ్యక్తులను మాత్రమే కాకుండా, వారి వెనుక ఉన్న కింగ్‌పిన్‌లు, ఆర్థిక సహకారం అందిస్తున్న ఫైనాన్షియర్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను కాపాడేందుకు డ్రోన్లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ నిఘా వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## ఇరాన్‌పై తీవ్ర దాడులకు ట్రంప్ ప్లాన్

మహా : గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' దాడుల తీవ్రతను మించిపోయేలా ఇరాన్‌పై కొత్త సైనిక చర్యను ప్రారంభించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచిస్తున్నట్లు ఆక్సియోస్ పేర్కొంది. భారీ స్థాయి దాడికి సంబంధించి తాను ఒక నిర్ణయానికి దగ్గరవుతున్నానని ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. అయితే దీనిపై తుది నిర్ణయం ఇంకా వెలువడలేదని ఆయన స్పష్టం చేశారు. తాము కోరితే ఇజ్రాయెల్ దళాలు దాదాపు తక్షణమే ఈ ఆపరేషన్‌లో పాల్గొనవచ్చని ట్రంప్ అన్నారు. అయితే టెహ్రాన్‌పై దాడికి అమెరికాకు విదేశీ సహాయం అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. "నేను ఒక భారీ దాడిని పరిశీలిస్తున్నాను. మునుపెన్నడూ లేనంత పెద్దదిగా. నేను నిర్ణయం తీసుకునేందుకు దగ్గరలో ఉన్నాను. మేమంతా దానికి సిద్ధంగా ఉన్నాము." అని ట్రంప్ అన్నారు. అదే సమయంలో, ఇప్పటివరకు సైనిక దళాలకు ఎలాంటి కొత్త ఆదేశాలు జారీ చేయలేదని ఇద్దరు అమెరికా అధికారులు ఆక్సియోస్‌కు తెలిపారు.

## 'ఏపీ అస్త్రం' ఆవిష్కరణ

**అమరావతి, మహా** ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీసులు రూపొందించిన 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన 'ఏపీ పోలీస్ రిట్రీట్ 2026: ఫ్యూచర్ పోలీసింగ్' కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్‌లో టెక్నాలజీ వినియోగం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. కేవలం టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థ నిర్మాణాన్నే పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

భవిష్యత్ పోలీసింగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.



## జిల్లాలో తలపెట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో తలపెట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఈ క్రమంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తిచేయాలని కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని సూచించారు.

ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచేందుకు కృషి చేయాలని వివరించారు. అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ పుష్పలత తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని చెప్పారు.

భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి మండలంలోని గ్రామపంచాయతీల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, త్రాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతిరోజు పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, గ్రామాలలో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి పనిని బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- ఉద్యోగాల భర్తీపై మరింత అధ్యయనం.
- నేతన్న భరోసాకు ఆమోదం.
- పుష్కరాలకు రూ.50 కోట్లు.
- ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచన.



**అమరావతి, మహా:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు మూడు గంటలపాటు సాగిన ఈ సమావేశంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతి, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సంక్షేమ పథకాలు, విద్య, సాగునీటి ప్రాజెక్టులు, పుష్కరాల ఏర్పాట్లు, ఎల్‌నినో పరిస్థితులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండో విడతగా 3,168 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనపై మరింత సమగ్ర అధ్యయనం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి తదుపరి కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఉద్యోగాల భర్తీ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ 'నేతన్న భరోసా' పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బీపీఎల్ కుటుంబాలకు చెందిన 50 ఏళ్లలోపు చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది.

వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే శ్రీకాకుళంలోని బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థల లీజును కొనసాగించేందుకు అనుమతి మంజూరు చేసింది.

రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణ, భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అదే విధంగా వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీ ఇవ్వడానికి కూడా ఆమోదం తెలిపింది.

విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్‌పై మంత్రివర్గం చర్చించింది. అలాగే నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసే ప్రతిపాదనను పరిశీలించింది. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్ 2 పనుల అంచనా వ్యయాన్ని రూ.241.20 కోట్ల నుంచి రూ.312 కోట్లకు పెంచేందుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

సమావేశంలో ఎల్‌నినో ప్రభావంపై ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా, పశువులకు మేత అందుబాటులో ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

మెగా డీఎస్సీ అంశాన్ని ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలతో ముడిపెట్టి వైసీపీ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. లేని వివాదాలను సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయని, అలాంటి ప్రచారాలపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పొగాకు ధరల అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ విషయాన్ని ప్రతిపక్షం రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తోందని మంత్రులు ప్రస్తావించగా, అలాంటి పరిస్థితికి అవకాశం ఎందుకు ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ప్రభుత్వం పొగాకు రైతుల ప్రయోజనాల కోసం తీసుకుంటున్న చర్యలను ముందుగానే ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, నిర్ణయాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు మంత్రులు మరింత చురుకుగా, ప్రోయాక్టివ్‌గా వ్యవహరించాలని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## సీజేపీ ఉద్యమం మరింత ఉధృతం

- నేడు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై వెనక్కి తగ్గేదిలేదన్న విద్యార్థి నేతలు
- ఢిల్లీ హైకోర్టులో పిటిషన్లు
- స్పందించిన ప్రధాని మోదీ



**ఢిల్లీ, మహా :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమం రోజురోజుకూ ఉధృతమవుతోంది. జూన్ 20 నుంచి జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనలపై కేంద్ర ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారం చూపేందుకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సహా తమ ప్రధాన డిమాండ్లపై ఎలాంటి రాజీ ఉండదని సీజేపీ నాయకులు స్పష్టం చేశారు. నేడు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చారు.

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మీడియాతో మాట్లాడుతూ, నీట్‌తో పాటు ఇతర అంశాలపైనా విద్యార్థులతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, విద్యార్థులు ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చలకు రావచ్చని ఆహ్వానించారు. అవసరమైనంత సమయం కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి తాను కూడా చర్చల్లో పాల్గొంటానని తెలిపారు. నడ్డా నివాసం, కార్యాలయం లేదా విద్యార్థులు సూచించిన ఏ వేదికలోనైనా సమావేశం నిర్వహించేందుకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

జూలై 20న సీజేపీ ప్రతినిధులు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి తమ డిమాండ్లను వినిపించగా, వాటిని సంబంధిత స్థాయిలో పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సీజేపీ తెలిపింది. అయితే ఉద్యమాన్ని విరమించాలంటే మూడు ప్రధాన డిమాండ్లు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి పరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి కేసులు నమోదు చేయబోమని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ఆయన పదవి నుంచి తప్పుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉద్యమం పూర్తిగా శాంతియుతంగా సాగాలని తాము కోరుకుంటున్నామని, అయితే అసాంఘిక శక్తులు చొరబడే అవకాశాలపై అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. గత ఉద్యమాల్లో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

జూలై 20న నిర్వహించిన "సంసద్ చలో" కార్యక్రమం అనంతరం పార్లమెంట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ లద్దాఖ్ సహ వ్యవస్థాపకురాలు గీతాంజలి అంగ్మో స్పందిస్తూ, శాంతియుతంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులను ఆధారాలు లేకుండా హింసాత్మక ఘటనలతో ముడిపెట్టడం బాధాకరమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఉద్దేశాలను ప్రశ్నించడం కంటే వారి ఆందోళనలను వినడం ముఖ్యమని అన్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తల్లి అనితా దీప్కే కూడా లాఠీచార్జ్‌ను ఖండిస్తూ, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యమానికి సంబంధించి పలు పిటిషన్లు ఢిల్లీ హైకోర్టు ముందుకు వచ్చాయి. సీజేపీ ఉద్యమం వెనుక విదేశీ నిధులు, రాజకీయ జోక్యం ఉన్నాయా అనే అంశాలపై దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం విచారణకు స్వీకరించింది. నిరసనల కారణంగా ప్రజలకు ఇబ్బందులు, ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లిందని పిటిషనర్ పేర్కొన్నారు. మరోవైపు, నిరసనకారులపై పోలీసులు అతిగా బల ప్రయోగం చేశారంటూ దాఖలైన పిటిషన్లపై కూడా విచారణ చేపట్టిన హైకోర్టు, సీసీటీవీ ఫుటేజ్ సహా అన్ని ఆధారాలను భద్రపరచాలని అధికారులను ఆదేశించింది.

నిరసనల ప్రభావంతో భద్రతా కారణాల దృష్ట్యా సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 16 మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేశారు. దీనిపై స్పందించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. మధ్యాహ్నంలోగా పరిస్థితి సరిదిద్దకపోతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటుందని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల కారణంగా న్యాయవాదులు హాజరుకాలేని సందర్భాల్లో ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వవద్దని ఇప్పటికే సూచించినట్లు వెల్లడించారు.

ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ అంశంపై స్పందిస్తూ యువత భవిష్యత్తు కంటే ముఖ్యమైనది మరేదీ లేదన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు..

## ఆగష్టు 10న జైల్ భరో జయప్రదం చేయాలి

**సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి**

**మంచిర్యాల, మహా :** ఆగష్టు 10న జైల్ భరో జయప్రదం చేయాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్ నాయక్ లు పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల పట్టణం పూరే భవనంలో సీఐటీయు, రైతు వ్యవసాయ కార్మిక ఆదివాసి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం స్వాతంత్ర రాకముందే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, దేశంలో పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు అనుకూలంగా వారికి లాభాలు చేకూర్చడం కోసమే లేబర్ కోడ్స్ ను బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిందని ధ్వజమెత్తారు. కార్మికుల పని భద్రతను పని గంటలను పెంచిందని వివరించారు. ఈపిఎఫ్, ఈఎస్ఐ ను ప్రైవేట్ ఇన్సూరెన్స్ వాళ్లకు అప్పగిస్తున్నారని అన్నారు. కార్మికుల మేడలకు లేబర్ కోడ్స్ ఉరితాళ్లుగా మారుస్తుందని పేర్కొన్నారు. కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం అమెరికా బ్రిటన్, న్యూజిలాండ్ లతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేస్తుందని ఆరోపించారు. భారత వ్యవసాయ రంగంలోకి 32 దేశాలు నుండి దిగుమతులను ప్రోత్సహించడంతో జీరో సుంకంతో దిగుమతులు రావడంతో దేశియా వ్యవసాయోత్పత్తుల ధరలు తగ్గిపోయి రైతులు దివాళా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబర్లో పత్తిపై ఉన్న 11 శాతం సుంకం తగ్గించి 40 లక్షల బేళ్ల పత్తిని అదనంగా దిగుమతి చేసుకోవడంతో దేశంలో పత్తి ధరలు పడిపోయాయని దుయ్యబట్టారు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టం2005 రూపొందిందని వివరించారు. దీని ప్రకారం వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 100 రోజుల పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రోజుకు 308 రూపాయలు చెల్లిస్తున్నారని చెప్పారు. దేశంలో మొత్తం వ్యయంలో 90 శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్రాలు భరించాలన్నారు. ఈ పథకానికి ఏటా 2.6 లక్షల కోట్లు పెంచాలని ఆందోళన జరుగుతుండగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసిందని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ పేరు తొలగించి "వికసిత్ భారత్ (గ్రామ్ జి" పేరు (విబిజి రామ్)గా మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10 శాతం నుండి 40 శాతం నిధులను భరించాలని నిర్ణయించిందన్నారు. సమైక్య పోరాటం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు. గత పార్లమెంట్ సమావేశాల్లో "2025 విద్యుత్ సవరణ బిల్లు"గా ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ చట్ట ప్రకారం ఇక నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ బాధ్యతలు కేంద్రం చూస్తుందని చెప్పారు. స్మార్ట్ మీటర్లు పెట్టి టారిఫ్ ముందుగానే వసూలు చేసి, ఉచిత విద్యుత్ రద్దు చేస్తారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా విద్యుత్ ను ప్రైవేటీకరించం, మోటర్లకు మీటర్ బిగించం అని చెబుతున్నప్పటికీ, ఈ సంక్షోభం నుండి బయట పడేందుకు భవిష్యత్ తో వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టడం, చార్జీలు పెట్టడం (పెంచడం) వంటి నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందని చెప్పారు

# అడుగంటుతున్న భూగర్భ జలాలు



ప్రకృతి సహకరించకపోవడం, వరుసగా తగ్గుతున్న వర్షపాతం, భూగర్భ జలాల క్షీణతతో తెలంగాణలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకప్పుడు ఏడాది పొడవునా నీరు అందించిన బోర్లు ఇప్పుడు ఎండిపోతుండగా, వందల అడుగుల లోతులో కొత్త బోర్లు వేసినా చుక్క నీరు పడని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ మహానగరం వరకు తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కుషాయిగూడ, చక్రిపురం, చర్లపల్లి, డా:ఏఎస్‌రావునగర్, పద్మశాలి టౌన్‌షిప్, బోడుప్పల్, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు, వంపుగూడ డివిజన్‌లోని సాయిబాబా నగర్ తదితర ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో ప్రజలు పూర్తిగా వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. వారానికి ఒకసారి వచ్చే ట్యాంకర్ నీరు కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కొన్ని చోట్ల నీటి కోసం మహిళలు గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సి వస్తోంది.

**వెయ్యి అడుగుల బోర్లు.. అయినా నీరు లేదు**

గతంలో 200 నుంచి 300 అడుగుల లోతులోనే నీరు లభించేది. ప్రస్తుతం 800 నుంచి 1000 అడుగుల వరకు బోర్లు వేసినా నీరు పడకపోవడంతో ప్రజలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

**భూగర్భ జలాలపై అధికారుల హెచ్చరిక**

జూలై 2026 తొలి పక్షానికి సంబంధించి భూగర్భ జలశాఖ నిర్వహించిన పరిశీలనల్లో జిల్లాలో సగటు భూగర్భ జల మట్టం 12.26 మీటర్లు నమోదైంది. జూన్ నెలతో పోలిస్తే 0.71 మీటర్లు, గత ఏడాది జూలైతో పోలిస్తే 2.91 మీటర్లు జలమట్టం తగ్గినట్లు అధికారులు వెల్లడించారు. వర్షాలు కురవకపోతే రానున్న నెలల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**కృష్ణా–గోదావరి జలాలపైనా ప్రభావం**

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కృష్ణా, గోదావరి నదుల్లోకి నీటి ప్రవాహం తగ్గింది. ఈ ప్రభావం తెలంగాణపై పడుతోంది. హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం మల్లన్నసాగర్ సహా వివిధ జలాశయాల నుంచి సరఫరా కొనసాగిస్తున్నప్పటికీ, నిల్వలు తగ్గితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఎండిపోతున్న చెరువులు.. రైతులకు కష్టకాలం

గ్రామాల్లో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పూర్తిగా ఎండిపోతున్నాయి. దీంతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. విత్తిన పంటలను కాపాడుకోలేక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక ప్రాంతాల్లో పశువులకు తాగునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. పక్షులు, ఇతర జీవరాశులు కూడా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి.

**ట్యాంకర్లపైనే ఆధారం**

నగరంలోని అనేక కాలనీల్లో తాగునీటి కోసం ప్రైవేటు ట్యాంకర్లే ఆధారంగా మారాయి. ట్యాంకర్ ధరలు పెరగడంతో మధ్యతరగతి, పేద కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపార సంస్థలు కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.

**పర్యావరణ విధ్వంసమే ప్రధాన కారణమా?**

అడవుల నరికివేత, చెరువుల ఆక్రమణలు, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే వ్యవస్థలు లేకపోవడం, పట్టణీకరణతో సిమెంట్, డాంబరు రోడ్లు పెరగడం వల్ల వర్షపు నీరు నేరుగా డ్రైనేజీల్లోకి వెళ్లిపోతోందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. దీంతో భూగర్భ జలాల పునరుత్పత్తి తగ్గిపోతోంది.

ఇంకుడు గుంతలే శాశ్వత పరిష్కారం

ప్రతి ఇంటిలో రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ఇంకుడు గుంతలు తవ్వాలని భూగర్భ జలశాఖ సూచిస్తోంది. చెరువులు, కుంటలు, వాగులను ఆక్రమణల నుంచి కాపాడటంతో పాటు వాటిలో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

**నీటిని పొదుపు చేయాల్సిన సమయం**

ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులు నీటి విలువను గుర్తు చేస్తున్నాయి. వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టడం, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించడం ద్వారా మాత్రమే భవిష్యత్తు తరాలకు తాగునీటిని అందించగలమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం తోడైతేనే భూగర్భ జలాలను కాపాడుకోవడం సాధ్యమవుతుందని వారు పేర్కొంటున్నారు.

**– దామరపల్లి నర్సింహారెడ్డి 9581358696**

---



# భారత రైతాంగానికి మోదీ ప్రభుత్వ వ్యూహాత్మక వరం!

## ప్రపంచ స్థాయి అవకాశాల దిశగా 'భారత్-అమెరికా ట్రేడ్ డీల్'పై వాస్తవిక, సాంకేతిక విశ్లేషణ

వాణిజ్య ఒప్పందాల (ట్రేడ్ అగ్రిమెంట్స్) గురించి వినగానే విదేశీ ఉత్పత్తులతో మన దేశీయ మార్కెట్ కుప్పకూలుతుందనే అపోహలు తరచుగా వ్యక్తమవుతుంటాయి. కానీ, అంతర్జాతీయ వాణిజ్యాన్ని కేవలం భయంతో కాకుండా, సాంకేతిక, వ్యూహాత్మక కోణంలో చూసినప్పుడు వాస్తవాలు వేరుగా కనిపిస్తాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అమెరికా వంటి దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్.టి.ఏ లు/బి.టి.ఏ లు) మార్కెట్ యాక్సెస్‌ను పెంచడానికి, నేరుగా రైతులకు, పరిశ్రమలకు ప్రయోజనాలను సృష్టించడానికి పకడ్బందీగా రూపొందించబడ్డాయి. ఇవి మన వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే అద్భుత అవకాశాలు. భారత రైతుల ప్రయోజనాలను రక్షిస్తూనే, గ్లోబల్ మార్కెట్లను వశం చేసుకునేందుకు మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న వాణిజ్య, సాంకేతిక వ్యూహాలు (ట్రేడ్ మెకానిజమ్స్) ఎంతో సమర్థవంతంగా ఉన్నాయి. వాణిజ్య ఒప్పందం అనగానే విదేశీ సరుకులకు తలుపులు బార్లా తెరిచినట్లు కాదు. మునుపటి వాణిజ్య ఒప్పందాలలో భారతదేశ విధానానికి అనుగుణంగా, వ్యవసాయ మార్కెట్ యాక్సెస్ ఉత్పత్తుల సున్నితత్వం (ప్రొడక్ట్ సెన్సిటివిటీ) ఆధారంగా క్రమాంకన (కాలిబ్రేటెడ్) మార్కెట్ ఓపెనింగ్ ద్వారా ప్రభుత్వం కట్టుదిట్టమైన సాంకేతిక భద్రతా కవచాలతో (టెక్నికల్ సేఫ్ గార్డ్స్ ఫర్ ఫార్మర్స్) అత్యంత కఠినమైన విధానాలతో అమలు చేస్తోంది. మన దేశ ఆహార భద్రతకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన అత్యంత సున్నితమైన వ్యవసాయ రంగాలను మినహాయింపు వర్గం (ఎగ్జెంప్షన్ కేటగిరీ) కింద పూర్తిగా రక్షించారు. దీనిలో పాడి పరిశ్రమ (డైరీ), పౌల్ట్రీ, మాంసం, గోధుమ, వరి, మొక్కజొన్న లాంటి ప్రధాన ధాన్యాలతో పాటు, జొన్న, సజ్జ, రాగి, కోడో మిల్లెట్, అమరాంత్ వంటి చిరుధాన్యాలు, అరటిపండ్లు, స్ట్రాబెర్రీలు, చెర్రీలు, సిట్రస్ పండ్లు, పచ్చి బఠానీలు, కాబూలీ శనగలు, పెసలు వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలు, పశుగ్రాసం ఉత్పత్తులు, వేరుశెనగ, తేనె, మాల్ట్, ఆల్కహాల్ లేని పానీయాలు, పిండి, స్టార్చ్, ముఖ్యమైన నూనెలు, ఇంధనం కోసం ఇథనాల్ మరియు పొగాకును వ్యవసాయ 'నెగెటివ్ లిస్ట్'లో ఉంచారు. అమెరికాకు చెందిన జన్యుమార్పిడి (జెనిటికల్లీ మాడిఫైడ్ జి.ఎమ్) సోయామీల్, ఆహార ఉత్పత్తులకు కూడా కఠిన నిషేధం విధించారు. అంటే వీటికి ఎలాంటి పన్ను రాయితీలు (టారిఫ్ కన్సెషన్లు) ఉండవు. దీనివల్ల మన చిన్నరైతుల మార్కెట్‌కు ఎలాంటి ముప్పు ఉండదు. కొన్ని సున్నితమైన వస్తువులైన పొట్టుతో ఉన్న బాదం, వాల్‌నట్‌లు, పిస్తాపప్పులు, కాయధాన్యాలు (లెంటిల్స్) మొదలైన వాటి దిగుమతులపై ప్రభుత్వం పరిమితులు (సేఫ్‌గార్డ్స్) విధించింది. వీటిని టారిఫ్ రేట్ కోటాల (టి.ఆర్.క్యూ) కింద సరళీకృతం చేసి, ఒక నిర్దిష్ట పరిమాణం వరకు మాత్రమే తగ్గిన పన్నుతో అనుమతిస్తారు, ఆ పరిమితి దాటితే భారీ సుంకాలు విధిస్తారు. విదేశాల నుండి నాసిరకం లేదా అత్యంత చౌకబారు ఉత్పత్తులు (డంపింగ్) మన మార్కెట్లోకి రాకుండా, విదేశీ సరుకుల దిగుమతులపై కనీస దిగుమతి ధరను (మినిమమ్ ఇంపోర్ట్ ప్రైస్ ఎమ్.ఐ.పి) నిర్దేశిస్తారు. మొక్కల భాగాలు, ఆలివ్‌లు, పైరెత్రమ్, ఆయిల్ కేక్‌లు వంటి ఎంచుకున్న సున్నితమైన వ్యవసాయ ఉత్పత్తుల కోసం, కొంత సుంకం రక్షణ కొనసాగేలా సుంకం తగ్గింపు (టారిఫ్ రిడక్షన్) వర్తించబడింది. ఇతర ఎఫ్.టి.ఏ ల విధానానికి అనుగుణంగా కనీస దిగుమతి ధర ఆధారిత సూత్రీకరణలతో పాటుగా ఆల్కహాలిక్ పానీయాలు కూడా ఈ సుంకం తగ్గింపులో చేర్చారు. భారతదేశ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ ఉపయోగించే కొన్ని ఇంటర్మీడియట్ ఉత్పత్తులైన కొబ్బరి నూనె, ఆముదం, పత్తి గింజల నూనె, అల్బుమిన్స్, మార్పు చేయబడిన పిండి పదార్థాలు (మాడిఫైడ్ స్టార్చెస్), లార్డ్, స్టీరిన్, పెప్టోన్స్ కోసం పదేళ్ల వరకు దశలవారీగా టారిఫ్ తొలగింపు (ఫేజ్డ్ ఎలిమినేషన్) స్వీకరించబడింది. ఈ సమయం దేశీయ వాటాదారులకు తగిన సర్దుబాటు స్థలాన్ని అందిస్తుంది. ఇతర ఎఫ్.టి.ఏ ల కింద ఇప్పటికే సరళీకృతం చేయబడిన ఎంపిక చేసిన నాన్‌సెన్సిటివ్ ఉత్పత్తులకు మాత్రమే తక్షణ సుంకం తొలగింపు (ఇమ్మీడియట్ డ్యూటీ ఎలిమినేషన్) ఆఫర్ చేయబడింది. ఈ ఒప్పందాల వల్ల మన రైతులకు నష్టం జరుగుతుందని కొందరు అపోహ పడుతున్నారు కానీ, ఈ వాణిజ్య ఒప్పందాలలోని ఎగుమతులకు రెడ్ కార్పెట్ (ఎక్స్పోర్ట్ ఆపర్చునిటీస్ అండ్ జీరో డ్యూటీ యాక్సెస్) అతిపెద్ద సానుకూల అంశం. మన దేశీయ ఉత్పత్తులకు ప్రపంచ అగ్ర దేశాల్లో లభించే ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుంటే, 1.36 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఎగుమతులపై అమెరికా ఎటువంటి అదనపు సుంకాన్ని విధించదు. ఈ సున్నా సుంకం (జీరో డ్యూటీ) యాక్సెస్ ద్వారా లబ్ధి పొందే ఉత్పత్తులలో పసుపు , మిర్చి, ఇతర సుగంధ ద్రవ్యాలు, టీ, కాఫీ మరియు వాటి ఎక్స్‌ట్రాక్షన్స్, కొబ్బరి, కొబ్బరి నూనె, వెజిటబుల్ వాక్స్, పోకచెక్కలు, బ్రెజిల్ నట్స్, జీడిపప్పు, చెస్ట్‌నట్స్ వంటి గింజలు, అవకాడోలు, అరటిపండ్లు, జామ, మామిడి, కివీస్, బొప్పాయి, పైనాపిల్, షిటేక్, పుట్టగొడుగులతో సహా పండ్లు, కూరగాయలు, బార్లీ, కానరీ విత్తనాల వంటి తృణధాన్యాలు, బేకరీ ఉత్పత్తులు, కోకో, కోకో ఉత్పత్తులు, నువ్వులు, గసగసాలు, అలాగే పండ్ల గుజ్జు, రసాలు, జామ్‌ల వంటి ప్రాసెస్ చేయబడిన ఉత్పత్తులు ఉన్నాయి. ఇందులో అనిశ్చితిని నివారించడానికి 1.035 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఉత్పత్తులకు సున్నా పరస్పర సుంకం (జీరో రెసిప్రోకల్ టారిఫ్) హామీ ఇవ్వబడింది, ఇది భారతీయ రైతులకు, ఎగుమతిదారులకు స్థిరత్వాన్ని, అంచనా సామర్థ్యాన్ని అందిస్తుంది. దీనివల్ల విదేశాల్లో మన సరుకులకు గిరాకీ పెరిగి, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర లభిస్తుంది. పారిశ్రామిక, తయారీ రంగంలో సుంకాల తగ్గింపు ద్వారా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు సుమారు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. మన రైతులు కేవలం స్థానిక అవసరాలకే కాకుండా, ప్రపంచ అవసరాలను తీర్చే స్థాయికి ఎదగాలంటే కొన్ని అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలు పాటించడం గ్లోబల్ వాల్యూ చైన్స్ (జి.వి.సి లు) లో కీలకం. విదేశాలకు ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులు ఖచ్చితమైన ఆరోగ్య మరియు పరిశుభ్రత ప్రమాణాలను (శానిటరీ అండ్ ఫైటో శానిటరీ ఎస్.పి.ఎస్) అలాగే సాంకేతిక ప్రమాణాలను (టెక్నికల్ బ్యారియర్స్ టూ ట్రేడ్ టి.బి.టి) పాటించాలి. పన్నుయేతర అడ్డంకులను (నాన్‌టారిఫ్ బారియర్స్ ఎన్.టి.బి లు) నివారించడానికి, మార్కెట్ యాక్సెస్‌ను మెరుగుపరచడానికి ప్రభుత్వం నిరంతరం భాగస్వామ్య దేశాలతో ఈ సాంకేతిక ప్రమాణాలపై చర్చలు జరుపుతోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) ద్వారా ఈ అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలపై రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్.పి.ఓ లకు) సాంకేతిక మద్దతు అందిస్తూ వారిని గ్లోబల్ సప్లయర్లుగా తీర్చిదిద్దుతున్నారు. వీటికి తోడుగా, రైతులను మరియు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఎగుమతి ప్రోత్సాహక మిషన్ (ఇ.పి.ఎమ్) కింద 2025-26 ఆర్థిక సంవత్సరం నుండి 2030-31 ఆర్థిక సంవత్సరం కాలానికి 25,060 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో వాణిజ్య ఆర్థిక మద్దతు, ప్యాకేజింగ్ మరియు లాజిస్టిక్స్ మద్దతు అందించబడుతుంది. అలాగే డిస్ట్రిక్ట్స్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్స్ (డి.ఇ.హెచ్) చొరవ కింద ప్రతి జిల్లాలో ఎగుమతి సామర్థ్యం ఉన్న 3 నుండి 5 ఉత్పత్తులను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ప్రోత్సహిస్తోంది. పంటను నేరుగా అమ్మేయకుండా, ఫార్మ్‌గేట్ (పొలం దగ్గరే) ప్రాసెసింగ్ చేసి గ్లోబల్ వాల్యూ చైన్స్ (జి.వి.సి లు) లో అనుసంధానంతో విదేశాలకు ఎగుమతి చేయడాన్ని ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలతో వ్యాపారం పెరిగినప్పుడు, మన ఊళ్లలో కూడా ఆధునిక కోల్డ్ స్టోరేజీలు (శీతల గిడ్డంగులు), ప్యాకేజింగ్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వేగంగా వస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులకు అమెరికా వంటి దేశాల్లో పన్ను రాయితీలు దక్కడం వల్ల వ్యవసాయ ఆధారిత మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎం.ఎస్.ఎం.ఈ లు) మరింత బలపడతాయి. వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం అనేది మన వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే ఒక గొప్ప ముందడుగు. మోదీ ప్రభుత్వ ఈ నిర్ణయం, మన దేశీయ మార్కెట్‌ను భద్రంగా కాపాడుతూనే, ప్రపంచ మార్కెట్లలో మన రైతులు ఆత్మవిశ్వాసంతో వ్యాపారం చేసుకునేలా చేస్తోంది. మనం పాత పద్ధతులు, అనవసర భయాలకే పరిమితం కాకుండా, ఈ ప్రపంచ స్థాయి అవకాశాలను రెండు చేతులా అందిపుచ్చుకోవాలి. ఇదే స్వావలంబన (ఆత్మనిర్భర్) మరియు అభివృద్ధి చెందిన భారత్‌కు (వికసిత్ భారత్) బలమైన పునాది వేస్తుంది.

**(శివ కుమార్ గనివాడ, సీనియర్ వ్యవసాయ, వాణిజ్య నిపుణులు, 9951715215 )**



## మధుమేహం ఉంటే కిడ్నీలను

# కాపాడుకోండి

**ఈ ఆహారపు పొరపాట్లు చేస్తే మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం**

ధుమేహం (డయాబెటిస్) కేవలం రక్తంలో చక్కెర స్థాయిలను మాత్రమే ప్రభావితం చేయదు. దీర్ఘకాలంలో గుండె, కంటి చూపు, నరాలతో పాటు మూత్రపిండాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువకాలం అదుపులో లేకపోతే, కిడ్నీల్లోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతిని వాటి వడపోత సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుంది. దీంతో కిడ్నీ వ్యాధులు, చివరికి కిడ్నీ వైఫల్యం వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. నేషనల్ కిడ్నీ ఫౌండేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కిడ్నీ వైఫల్య కేసుల్లో దాదాపు 44 శాతం మధుమేహం కారణంగానే సంభవిస్తున్నాయి. అందుకే మందులు క్రమం తప్పకుండా వాడటంతో పాటు సరైన ఆహారపు అలవాట్లు పాటించడం కూడా అత్యంత కీలకం అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహంతో బాధపడేవారు తెలియకుండానే చేసే కొన్ని ఆహారపు పొరపాట్లు కిడ్నీలపై అదనపు భారాన్ని మోపుతాయని హెచ్చరిస్తున్నారు.

**ఉప్పు ఎక్కువైతే కిడ్నీలపై ఒత్తిడి**

ఆహారంలో ఉప్పు, సోడియం ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు పెరుగుతుంది. అధిక రక్తపోటు కిడ్నీల వడపోత వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ప్యాకెట్ స్నాక్స్, చిప్స్, ఊరగాయలు, ప్రాసెస్ చేసిన ఆహారాల్లో సోడియం అధికంగా ఉంటుంది. అందువల్ల రోజువారీ ఆహారంలో ఉప్పు వినియోగాన్ని తగ్గించడం ద్వారా కిడ్నీలను రక్షించుకోవచ్చు.

**ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి**

ఇన్‌స్టంట్ నూడుల్స్, ఫ్రోజెన్ ఫుడ్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్ వంటి ప్రాసెస్ చేసిన ఆహారాల్లో సోడియంతో పాటు అనారోగ్యకరమైన కొవ్వులు, కృత్రిమ రసాయనాలు అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెరను ఒక్కసారిగా పెంచడమే కాకుండా, దీర్ఘకాలంలో మూత్రపిండాల పనితీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. వీలైనంత వరకు తాజా, ఇంట్లో తయారుచేసిన ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వడం మంచిది.

**అధిక ప్రోటీన్ కూడా ప్రమాదమే**

ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషకమే అయినప్పటికీ, అవసరానికి మించి తీసుకుంటే కిడ్నీలు అదనపు శ్రమ పడాల్సి వస్తుంది. ముఖ్యంగా మధుమేహంతో పాటు ప్రారంభ దశ కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే ప్రోటీన్ ఆహారం తీసుకోవాలి. ప్రోటీన్ సప్లిమెంట్లు లేదా అధిక మాంసాహారం తీసుకోవడం ముందు నిపుణులను సంప్రదించడం మంచిది.

**తగినంత నీరు తప్పనిసరి**

రోజంతా సరిపడా నీరు తాగకపోతే శరీరంలో వ్యర్థాలు సరిగా బయటకు వెళ్లవు. దీంతో కిడ్నీలపై అదనపు భారం పడుతుంది. తగినంత నీరు తీసుకోవడం వల్ల శరీరంలోని విషపదార్థాలు సులభంగా బయటకు వెళ్లి, మూత్రపిండాలు సమర్థవంతంగా పనిచేస్తాయి. అయితే ఇప్పటికే కిడ్నీ వ్యాధి ఉన్నవారు ఎంత నీరు తాగాలో వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.



**భోజనం మానేయడం కూడా ప్రమాదమే**

చక్కెర తగ్గుతుందనే ఉద్దేశంతో కొందరు భోజనం మానేస్తుంటారు. కానీ ఇలా చేయడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిల్లో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుని కిడ్నీలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నిర్ణీత సమయాలకు సమతుల్య ఆహారం తీసుకోవడం, తగిన వ్యాయామం చేయడం, మందులు క్రమం తప్పకుండా వాడడం ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు.



**చక్కెర, మైదా పదార్థాలతో జాగ్రత్త**

మిఠాయిలు, కూల్‌డ్రింక్స్, బేకరీ పదార్థాలు, మైదాతో తయారయ్యే ఆహారాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను వేగంగా vపెంచుతాయి. తరచూ ఇలా చక్కెర స్థాయిల్లో హెచ్చుతగ్గులు రావడం వల్ల కిడ్నీల్లోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతిని వాటి పనితీరు క్రమంగా తగ్గిపోతుంది. అందువల్ల తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ధాన్యాలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని ఎంచుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### నిపుణుల సూచనలు

మధుమేహం ఉన్నవారు ఏడాదికి కనీసం ఒకసారి కిడ్నీ పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. రక్తంలో చక్కెర, రక్తపోటును నియంత్రణలో ఉంచడం, ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడం, తగినంత నీరు తాగడం, వైద్యుల సూచన మేరకు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా కిడ్నీలను చాలా వరకు రక్షించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చిన్నచిన్న ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటే భవిష్యత్తులో కిడ్నీ సంబంధిత తీవ్రమైన సమస్యలను నివారించే అవకాశం ఉంటుంది.



## ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

**కాంగ్రెస్ నేతల డిమాండ్**
**మావలలో రాస్తా రోకో**

**ఆదిలాబాద్ మహా :** విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని మావల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కుదురుపాక.సురేష్ కుమార్ డిమాండ్ చేసారు. గురువారం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి యుత నిరసన కార్యక్రమం చేపట్టారు.దేశ వ్యాప్తంగా నీట్, జేఈఈ లాంటి పోటీ పరీక్షల పేపర్ల లీకేజీపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రిధర్మేంద్ర ప్రధాన్ తో పాటు ప్రధాని మోదీ వెంటనే రాజీనామాచేయాలని నినాదాలు చేసారు. పేపర్ లీకేజీలతో ఆత్మస్తైర్యం కోల్పోయి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు.ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని అన్నారు.మావల మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తూ రహదారిపై బైఠాయించడంతో పోలీసులు వారిని అక్కడినుండి తరలించారు.

## పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **తడి–పొడి చెత్త వేర్వేరుగా అందించడం ప్రతి ఇంటి బాధ్యత**
- **బల్దియా కమిషనర్ టి. వెంకన్న**



**వరంగల్, కార్పోరేషన్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఖాజీపేట సర్కిల్ 59వ డివిజన్‌లో మోడల్ డివిజన్ గా అమలు చేస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గృహ యజమానులతో నేరుగా మాట్లాడిన కమిషనర్, తడి -పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తున్నారా, స్వచ్ఛ ఆటోలు క్రమం తప్పకుండా చెత్తను సేకరిస్తున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి నుంచి వంద శాతం తడి -పొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**కూరగాయల మార్కెట్ ను సందర్శించిన కమిషనర్**

అనంతరం స్థానిక కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన కమిషనర్, వ్యాపారులతో మాట్లాడి ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. వాటికి ప్రత్యామ్నాయంగా బట్ట సంచులు, ఇతర పర్యావరణహిత సంచులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. మార్కెట్‌లోనే సరసమైన ధరలకు బట్ట సంచులు అందుబాటులో ఉన్నాయని, వాటినే వినియోగించాలని సూచించారు.

కిరాణా దుకాణాలను కూడా పరిశీలించిన కమిషనర్, ప్లాస్టిక్ సంచుల వినియోగం పై వినియోగదారులకు అవగాహన కల్పించాలని దుకాణదారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న ఒక వ్యాపారికి రూ.2,000 జరిమానా విధించారు. ప్రధాన రహదారుల పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన కమిషనర్,ఎక్కడా చెత్త పేరుకు పోకుండా నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుపై నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు పడేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ, రోడ్డుపై సి&డి వ్యర్థాలు వేసిన వ్యక్తికి రూ.5,000 జరిమానా విధించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయడం, యాంటీ లార్వల్ ఆయిల్ స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని మలేరియా, విభాగ అధికారులను ఆదేశించారు.

ఈ పరిశీలనలో సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, ఎంహెచ్‌వో డా. రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్లు గోల్కొండ శ్రీను, నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్, మలేరియా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డ్, ఇండోర్ స్టేడియంను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**యాదాద్రి భువనగిరి జులై 23 మహా :** పట్టణ ప్రకృతి వనాలు, డపింగ్ యార్డ్, ఇండోర్ స్టేడియం పట్టణ అభివృద్ధి పనుల నిర్వహణ పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్, ఇండోర్ స్టేడియం, పట్టణ ప్రకృతి వనాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి గురువారం పరిశీలించారు.ముందుగా డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన కలెక్టర్ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే విధానం, సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియ, బయో మైనింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. మున్సిపాలిటీలో మొత్తం ఎంత మంది శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు వినియోగిస్తున్నారని , ఇంటింటికి తిరిగి చెత్తను ఏ విధంగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డపింగ్ యార్డ్ ను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పట్టణ పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, సూచించారు. అనంతరం ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేడియం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, ప్రధాన ప్రవేశ ద్వారానికి గేటు ఏర్పాటు చేయాలని, స్టేడియం లోపల తగినంత లైటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. క్రీడాకారులు, యువత సౌకర్యవంతంగా వినియోగించుకునేలా అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.తదుపరి పట్టణ ప్రకృతి వనాన్ని సందర్శించిన కలెక్టర్,పట్టణ ప్రకృతి వనం శుభ్రంగా ఉండే విధంగా, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా ఉండాలన్నారు. మంచి మొక్కలు, నీడనిచ్చే చెట్లు, ఇతర ఉపయోగకరమైన మొక్కలు పెంచాలని సూచించారు.అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పచ్చని చెట్ల తో వాతావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీవాణి, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి , మున్సిపల్ అధికారులు, శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ

- **మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**



**యాదగిరిగుట్ట జూలై 23 మహా యాదాద్రి** భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థినుల విశ్రాంతి గదులు, భోజనశాల, వంటగది, నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, నూనె తదితర వంట సరుకులు, కూరగాయల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత, విద్యుత్ సదుపాయం, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యత, వసతి, తాగునీరు, పారిశుధ్యం, విద్యా వాతావరణం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన వసతి కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్యం, విద్య, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునే వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ వాణి భరత్ గౌడ్, ఇంటర్ విద్యాధికారి రమ్మణి తదితరులు ఉన్నారు.

## భూ సర్వే గ్రామసభ

- **భూ సర్వే కు రైతులు సహకరించాలి**
- **తహసిల్దార్ దశరథ**

**వలిగొండ జులై 23 మహా న్యూస్** మండలంలోని గోపరాజుపల్లి లో గురువారం జరిగిన రీ భూ సర్వే గ్రామ సభలో తహసిల్దార్ దశరథ పాల్గొన్నారు ఈ సందర్భంగా తాసిల్దార్ దశరథ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే కు రైతులు సహకరించాలనారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సలిగంజి పృధ్వి ఆర్ఐ నగేష్ జిపిఓ పరశురాములు పంచాయతీ కార్యదర్శి నవనీత కారోబార్ వనం జనార్ధన్ రైతులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా భువనగిరి ఎంపీ చామల పుట్టినరోజు వేడుకలు

**భువనగిరి జులై 23మహా** భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అనుచరులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు అతహార్ అధ్వర్యంలో భువనగిరి జిల్లా కేంద్రంలోని రైతు బజారు ఎదురుగా బాబు జగజీవన్ రామ్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేశారు

అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగెల్లపల్లి శ్రీవాణి రవి కుమార్, గ్రంధాలయ చైర్మన్ ఓవైస్ చీష్టి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు పోతంశెట్టి వెంకటేష్, బర్రె జహంగీర్, పీసీసీ డెలిగేట్ మెంబెర్ తంగేళ్లపల్లి రవి కుమార్ మాట్లాడుతూ జన నాయకుడిగా పేరొందిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మరెన్నో ఉన్నత పదవులు పొందాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని వేడుకున్నారు అదేవిదంగా దేశంలోనే ఒక మంచి పేరు సంపాదించుకున్న యువ నాయకుడు భువనగిరి ప్రజల ఎన్నో ఏళ్ల కల ఎం ఎం టి ఎస్ రైలు కొరకు పార్లమెంట్లో కొట్లాడి సాధించారని ప్రస్తుతం ఆ పనులు జరుగుతుండడం సంతోషకరమని అన్నారు. అంతే కాకుండా జాతీయ రహదారిలో అండర్పాస్ లు,రైల్వే అండర్ బ్రిడ్జ్ లు మంజూరు చేపించడమే కాకుండా కేంద్రం నుండి తెలంగాణకు రావలసిన నిధుల కొరకు పార్లమెంట్లో గలమెత్తి నిధులు సాదిస్తున్న ఏకైక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అని కొనియాడారు.

భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్,జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు కాకునూరి మహేందర్,డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మజహార్,కాంగ్రెస్ నాయకులు బెండె లాల్ రాజ్,రగుబాబు ,షేఖ్ మజహార్ పాషా,రాజు,గుర్రాల శ్రీనివాస్,కృష్ణ యాదవ్, కైరంకొండ వెంకటేష్,కొత్త నర్సింహా స్వామీ,రాము,ఉపేందర్,షరీఫ్,శివ, అఖిల్, సామాజిక వేత్తలు బట్టు రామ్ చంద్రయ్య, బాలేశ్వర్ మరియు మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపిటీసి లు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వరుణ యాగంలో పాల్గొన్న మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట జులై 23 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో గురువారం నిర్వహించిన వరుణ యాగం కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ , ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో వారు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రార్థించారు.అంతకుముందు మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనం మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు లడ్డు ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు యాత్రను జయప్రదం చేయండి

**కల్లుగీత కార్మిక సంఘం పిలుపు..**

**వలిగొండ జూలై 23 మహా న్యూస్** అమర వీరుల యాదిలో జరుగు గీతన్నల బస్సు యాత్రను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు లు పిలుపునిచ్చారు గురువారం వలిగొండ మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకమైన బస్సు యాత్రను జయప్రదం చేయలని రాష్ట్రంలో ఒక కోటి తాటి ఈత వృక్ష సంపదను ప్రకృతి మనకు ప్రసాదించింది వీటిపై గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు గీత కార్మికుల ఉపాధిని మెరుగుపరచాలని అన్నారు వృత్తిలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో మనకు ఇచ్చిన హామీలు పెన్షన్ 4000 రూపాయలు చెట్ల పెంపకానికి5 ఎకరాల భూమి ప్రతి సొసైటీకి ఇవ్వాలని కోరారు కోటివరాల పథకంలో కల్లు గీత సొసైటీలకు ఇచ్చిన భూములకు ఫినిషింగ్ నీటి సౌకర్యం కల్పించి క తాటి ఈత ఖర్జూర చెట్లు నాటాలని అన్నారు వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని అందరూ వాడే విధంగా చైతన్యం కల్పించాలన్నారు నీరాకు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన రూపాయలు 25 కోట్లు సంక్షేమానికి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేయాలని అన్నారు నందనంలోని నీరా సెంటర్ను ప్రారంభించాలని ప్రతి జిల్లాలో తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని అన్నారు అదేవిధంగా ఆగస్టు 18 సర్వే పాపన్న జయంతి రోజు ట్యాంక్ బండ్ పై విగ్రహం ప్రతిష్టాలని అన్నారు ఆగస్టు 9వ తేదీన వలిగొండ మండలానికి వచ్చే బస్సు యాత్రను జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పబ్బతి మల్లేశం కార్యదర్శి పలుసం స్వామి రేకల లక్ష్మీనారాయణ లింగరాజు పల్లి సర్పంచ్ లింగస్వామి కొండూరు అంజయ్య పబ్బు స్వామి ధనంజయ శ్రీకాంత్ మారయ్య గోపాల్ మల్లేశం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాహుల్ ప్రియాంక గాంధీ లా పై దాడిని ఖండిస్తూ

## రోడ్డుపై మంత్రి కొండ సురేఖ ధర్నా



**యాదగిరిగుట్ట జూలై 23 మహా :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ,బీర్ల అయిలయ్యలు ధ్వజమెత్తారురాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి అగ్ర నాయకులను ఈడ్చుకెళ్తూ కూడా రోడ్లపై 'మ్యాన్హాండ్లింగ్' చేశారని, మహిళా కానిస్టేబుళ్లతో ప్రియాంక గాంధీని నెట్టి వేయించడం బీజేపీ అరాచక పాలనకు పరాకాష్ట అని వారు విమర్శించారు.యాదగిరిగుట్టలో గురువారం రోడ్డు పై మంత్రి కొండ సురేఖ,ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి బైటాయించి నిరసన ధర్నా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12 ఏళ్లలో ఎన్డీఏ ఆధ్వర్యంలో దాదాపు 150కి పైగా ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని మంత్రి ఆరోపించారు. సరైన న్యాయం జరగక ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రధాని నరేంద్ర మోదీకి కనపడకపోవడం శోచనీయమన్నారు. నేడు కోట్లాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమవుతున్న మోదీ ప్రభుత్వం స్పందించకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రధాని మోదీ వెంటనే స్పందించి పారదర్శకంగా కొత్త సంస్థ ద్వారా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల డిమాండ్లు నెరవేరే వరకు కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కేంద్రంలోఅధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం యాదగిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి మాట్లాడారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా క్వశ్చన్ పేపర్ల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, నిరుద్యోగులు తమ భవిష్యత్తు కోసం చేపట్టిన ధర్నా పై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని మంత్రి మండిపడ్డారు. లాఠీఛార్జ్ చేసి తలలు పగిలేలా, కాళ్లు చేతులు విరిగేలా కొట్టడం దారుణమన్నారు.



## తట్టలు అల్లిన మంత్రి సురేఖ

**యాదగిరిగుట్ట, మహా:** యాదగిరిగుట్టలో పర్యటించిన రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వెదురు తట్టలు, బుట్టలు అల్లుతూ జీవనం సాగిస్తున్న కుటుంబాన్ని కలుసుకుని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి వృత్తి విధానాన్ని ఆసక్తిగా పరిశీలించిన మంత్రి కొంతసేపు స్వయంగా తట్టలు అల్లి, వారు తయారు చేసిన రెండు తట్టలను కొనుగోలు చేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కులవృత్తులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వెదురు ఉత్పత్తులను ఎక్కువగా ఉపయోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించే సంప్రదాయ వృత్తులను ఆదరించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కులవృత్తుల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని బీర్ల అయిలయ్య అన్నారు.



## విద్యార్థులకు న్యాయం చేయాలి

- **కేంద్ర విద్యా శాఖా మంత్రి రాజీనామా చేయాలి**
- **గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన**

**ఆదిలాబాద్ మహా** : ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జికి నిరసనగా సంఘీభావం తెలిపి ప్రధాని ఇంటిముందు శాంతియుత ధర్నా చేస్తున్న పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ కాంగ్రెస్ నేతలు అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మసంతోష్ విమర్శించారు.విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. విద్యార్థుల డిమాండ్ మేరకు కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను పదవినుండి తొలగించాలని డిమాండ్ చేసారు. అటు శాంతియుతంగా విద్యార్థులు నిరసన తెలుపుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా స్పందించకపోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖిజార్ పాషా అన్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడానికి తీవ్రంగా ఖండించారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కు నష్ట పరిహారాన్ని అందించి వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెంటనే తనల పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ, డేరా కృష్ణా రెడ్డి , దేవిదాస్, బండి సంజయ్, వెంకన్న యాదవ్,అశోక్,మహేందర్, కపిల్, అరవింద్,కావేటి జ్యోతి, అనిల్,రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# ఒక వ్యక్తికి ఒకే ఓటు

- రెండు ఓట్లు కలిగి ఉండటం చట్ట విరుద్ధం
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- స్పష్టం చేసిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో రెండు చోట్ల ఓటు హక్కు నమోదైన (డబుల్ ఓటర్లు) వారు వెంటనే ఒకే ప్రాంతంలో ఓటు కొనసాగించేలా నిర్ణయం తీసుకుని, మరో ప్రాంతంలోని ఓటును తొలగించేందుకు అవసరమైన ఎన్యుమరేషన్ ఫారాలను రెండు, మూడు రోజుల్లోగా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఒక వ్యక్తికి ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటు కొనసాగించడం ఎన్నికల చట్టానికి విరుద్ధమని స్పష్టం చేశారు.అర్బన్ లేదా గ్రామీణ ప్రాంతంలో ఎక్కడ ఓటు కొనసాగించాలనుకుంటున్నారో సంబంధిత ఓటర్లు వెంటనే నిర్ణయం తీసుకోవాలని, ఈ అంశంపై రాజకీయ పార్టీలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో ఓటరు జాబితాలో ఉన్న లోపాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా సమస్యలు లేవని, మావల, ఆదిలాబాద్ అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే కొన్ని స్వల్ప వ్యత్యాసాలు గుర్తించినట్లు పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా 2025 ఓటరు జాబితా ప్రకారం 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న కేంద్రాలను మాత్రమే పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రొఫార్మాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు అందజేశామని చెప్పారు. మరణించిన, చిరునామా మారిన ఓట్ల తొలగింపు అనంతరం మిగిలే తుది ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన చోట్ల మాత్రమే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడతామని వివరించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేశామని, గుర్తించిన వ్యత్యాసాలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణలో నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు, సందేహాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ ఎస్ చిత్రు, ఆర్డీఓ జగదీశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రాకేష్, బండి దత్తాత్రేయ, గుడిపల్లి నగేష్, మహమ్మద్ జకరియా, దీపక్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.




# ఫామ్ పాండ్ లు నిర్మించుకోవాలి

**జలసిరులు పెంచుకోవాలి**
**కలెక్టర్ భవేష్ మిశ్రా సూచన**

**భైంసా మహా:** జలసిరి ఫామ్ పాండ్ లు భూగర్భ జలాల పెంపుదలకు దోహదం చేస్తాయని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా, ఫామ్ పాండ్ నిర్మాణ శంకుస్థాపన చేశారు.గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో, ఫామ్ పాండ్ నిర్మాణానికి కలెక్టర్ గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి, అభినందించారు. వారి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ ల నిర్మాణాలు దోహదం చేస్తాయని వివరించారు. ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ ఉన్నాయని, ఇటువంటి నీటి నిల్వ నిర్మాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో పంటకు నీరు అందుతుందని తెలిపారు. భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించి గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు, రైతులు కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు న్యాయం చేయాలి

- కేంద్ర విద్యా శాఖా మంత్రి రాజీనామా చేయాలి
- గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

**ఆదిలాబాద్ మహా** : ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జికి నిరసనగా సంఘీభావం తెలిపి ప్రధాని ఇంటిముందు శాంతియుత ధర్నా చేస్తున్న పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ కాంగ్రెస్ నేతలు అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మసంతోష్ విమర్శించారు.విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. విద్యార్థుల డిమాండ్ మేరకు కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను పదవినుండి తొలగించాలని డిమాండ్ చేసారు. అటు శాంతియుతంగా విద్యార్థులు నిరసన తెలుపుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా స్పందించకపోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖిజార్ పాషా అన్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడానికి తీవ్రంగా ఖండించారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కు నష్ట పరిహారాన్ని అందించి వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెంటనే తనల పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ, డేరా కృష్ణా రెడ్డి , దేవిదాస్, బండి సంజయ్, వెంకన్న యాదవ్,అశోక్,మహేందర్, కపిల్, అరవింద్,కావేటి జ్యోతి, అనిల్,రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఎల్ నినో సవాల్‌కు అప్రమత్తం... ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణ

**హుస్నాబాద్‌లో మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమీక్ష**



**హుస్నాబాద్ మహా :** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సమస్యలు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకుని అమలు చేయడం ద్వారా తాగునీరు, వ్యవసాయం, పశుసంపద, భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.గురువారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, అదనపు కలెక్టర్లు, మూడు జిల్లాల వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు.

**తాగునీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం**

ఎల్ నినో ప్రభావంతో వచ్చే జూన్ వరకు సాధారణ వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్తల అంచనాలను ప్రస్తావించిన మంత్రి, గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని సూచించారు. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రతరం కాకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి**

వ్యవసాయ శాఖ రైతులకు వరికి బదులుగా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహించాలని, పశుసంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాస కొరత ఏర్పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి**

ూగర్భ జలాల మట్టం పడిపోతున్న నేపథ్యంలో ప్రతి ఇంటిలో, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జలసిరి, వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేసి పడిన ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**అభివృద్ధి పనులు వేగంగా... తాగునీటికే తొలి ప్రాధాన్యం**

హుస్నాబాద్ నియోజకవర్గంలో శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కళాశాల, కరీంనగర్-హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి, అక్కన్నపేట-హుస్నాబాద్ రహదారి విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి వంటి పలు ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమైనప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరాలి**

రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి అర్హుడికి అందేలా అధికారులు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.

**వరి సాగు విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంటలకు ప్రోత్సాహం**

కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. తక్కువ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

**15 రోజులకోసారి భూగర్భ జలాల సమీక్ష**

ఎల్ఎండీ నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలపై ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి 15 రోజులకోసారి భూగర్భ జలాల పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్, నీటి పారుదల శాఖలతో సమన్వయం చేసుకుని తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

గ్రామ, మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వాములుగా చేసుకుని ఎల్ నినోను ఎదుర్కొనే కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తామని, వీబీజీ రామ్‌జీ పథకం కింద గ్రామాల వారీగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణం చేపడతామని కలెక్టర్ చిత్రా మిశ్రా వెల్లడించారు

చిగురుమామిడి మండలంలో గతేడాది 22 వేల ఎకరాల్లో సాగైన వరిని ఈసారి 8 వేల ఎకరాలకు, సైదాపూర్ మండలంలో గతేడాది 19 వేల ఎకరాల నుంచి 8 వేల ఎకరాలకు తగ్గించినట్లు వివరించారు.

**ఆయిల్ పామ్, పశుపోషణపై ప్రత్యేక కార్యాచరణ**

ఈ నెల 14 నుంచి గ్రామాల వారీగా వ్యవసాయ అధికారులు రైతులతో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారని, వేరుశనగ, పొద్దుతిరుగుడు సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రెండు మండలాల్లో 170 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించామని, రైతుల ఆదాయం తగ్గకుండా పశుపోషణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.

# నీట్ లీకేజీపై విద్యార్థుల నిరసన

**రాజేంద్రనగర్, మహా:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం, ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం శంషాబాద్ బస్టాండ్ కూడలిలో ఆందోళన నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన హక్కును అణచివేయడం ఖండనీయమని విద్యార్థి సంఘాల నాయకులు ఆనంద్, ప్రణయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్.**

**పాలకుర్తి, జూలై 23 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని వర్షాభావ పరిస్థితులు మరియు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో బోర్ల కింద, బావుల కింద అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయడమే రైతులకు లాభదాయకమని రామగుండం శాసనసభ్యులు పేర్కొన్నారు. గురువారం పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక సర్పంచ్‌లు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతులతో శాసనసభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ. ప్రస్తుత సీజన్‌లో సాధారణ వర్షపాతం లేకపోవడం వల్ల జలాశయాలు, చెరువులు నిండే అవకాశం లేదని, ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గడం వల్ల భూగర్భ జలాలు కూడా పడిపోయి బోర్లలో నీరు సరిపడా లభించదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులు పూర్తి విస్తీర్ణంలో వరి వేయకుండా,జొన్న, పెసలు, మినుములు, కంది, పొద్దుతిరుగుడు,నువ్వులు, సోయాబీన్, ఆముదం, రాగులు వంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.అలాగే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు.గ్రామ స్థాయిలో రైతులకు ఎల్‌నినో ప్రభావం మరియు ఆరుతడి పంటల ప్రయోజనాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఏఈఓలు ఎం. సువర్ణరేఖ, కే. శ్రీకాంత్, జే. సుష్మ మరియు పరిసర గ్రామాల చిన్న, సన్నకారు రైతులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో ఇద్దరు హెల్మెట్ ధరించాలి

**ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ, ఐపీఎస్ అధికారి శివమ్ ఉపాధ్యాయ్**

**మొయినాబాద్ మహా:** ఇటీవల సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే తీవ్ర గాయాలకు గురవుతున్నారని, ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే (పిలియన్) ప్రయాణికుడు కూడా తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలున్న హెల్మెట్ ధరించాలని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ డీసీపీ, ఐపీఎస్ అధికారి శివమ్ ఉపాధ్యాయ్ తెలిపారు. గురువారం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధి మొయినాబాద్ పరిధిలోని పాత అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సుమారు 70 మంది ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు ముఖ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ్ పాల్గొని, సుమారు 70 మంది ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు ముఖ్య సూచనలు చేశారు.అనంతరం డీసీపీ ఐపీఎస్ అధికారి శివమ్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు రైడర్‌తో పాటు పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఐఎస్ఐ (ISI) ప్రమాణాలున్న నాణ్యమైన హెల్మెట్ మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. వాహనం నడిపే సమయంలో లేన్ క్రమశిక్షణ పాటిస్తూ,



ప్రమాదకరంగా లేన్ మార్చకుండా వాహనం నడపాలని తెలిపారు. అతి వేగం, నిర్లక్ష్యంగా మరియు ప్రమాదకరంగా వాహనం నడపరాదన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయడం చట్టవిరుద్ధం అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమే కాక చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలు మరియు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలంటే హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అర్హులైన ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బీ.సతీష్ మరియు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో నూతన జనరేటర్

**నిర్మల్ మహా:** నిర్మల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన జనరేటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్ గురువారం ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాల సమయంలో కూడా కలెక్టరేట్ లోని కార్యాలయాల పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నూతన జనరేటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, సిబ్బంది పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

**పాలకుర్తి, జులై 23 మహా పెద్దపల్లి** జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ అన్నారు.పాలకుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మండలానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా అందేలా తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఆడపిల్ల పెండ్లి భారం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ మాజీ ఎంపీపీ రమేష్, సర్పంచ్‌లు పెద్దపల్లి తిరుమల, కొత్తపల్లి సర్పంచ్ ప్రశాంత్,జీడి నగర్ సర్పంచ్ సూర రమా, రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ మొగిలి, చిలగాని రాజేశం ,ఉయ్యాల సత్తయ్య నాయకులు,కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ విషయమై భర్త మందలింపు.. భార్య అదృశ్యం.

- పిఎస్ లో ఫిర్యాదు చేసిన భర్త

**కుషాయిగూడ , మహా:** భార్య ఫోన్లో విపరీతంగా మాట్లాడుతుండగా భర్త మందలించడంతో భార్య అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం ...జవహర్ నగర్ లోని కోమటి రాజయ్య, కవిత దంపతులు బాలాజీ నగర్ లో నివసిస్తున్నారు. కొంతకాలంగా కవిత(40) విపరీతంగా ఫోన్లో మాట్లాడుతుండగా భర్త రాజయ్య మందలించాడు. కినుకు వహించిన కవిత ఈ నెల 22వ తేదీన మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయింది. సాయంత్రం రాజయ్య ఇంటికి రాగా కవిత కనపడలేదు. ఈ మేరకు భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కవిత గురించి భర్త రాజయ్య చుట్టుపక్కల వెతికినా తెలిసిన వారి వద్ద వెతికినా బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# వరలక్ష్మీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ-పెద్దమ్మ తల్లుల దేవస్థానంలో నిర్వహిస్తున్న నాలుగో వార్షిక శ్రీ వరలక్ష్మీదేవి నవరాత్రి మహోత్సవాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. సకాలంలో వర్షాలు పడాలని పాడి పంటలు పండాలని తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కులు ద్వారా వేడుకున్నారు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో ఉండాలని బండారు లక్ష్మారెడ్డి



కోరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.



## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**రాజేంద్రనగర్ మహా;** నీట్ పేపర్ లీకేజీ పై ఢిల్లీలో నిరసనలు చేస్తున్న విద్యార్థులకు మద్దతు తెలపడానికి వెళ్లిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా శంషాబాద్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలోమండల అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బస్టాండ్ నుంచి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు నీట్ పేపర్ లీకేజ్ కు కారకులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనంటు అంబేద్కర్ కు వినతి పత్రం అందజేశారు. అధ్యక్షులు మహేందర్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీ కి పూర్తి బాధ్యత వహిస్తూ వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసన ప్రజాస్వామ్యంలో స్వతంత్ర ఉద్యమాన్ని సత్యాగ్రహాన్ని తరలించింది. విద్యార్థులను పోలీసులు కొడుతుంటే ఇంకా కొట్టండి అనే గాంధేయ మార్గంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లు రవీ నాయక్, పార్టీ నాయకులు లింగం, ఆంజనేయులు, గోపాల్ నాయక్, ఎన్ ఎస్ యు ఐ, స్టేట్ సెక్రటరీ ఆనంద్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దేవేందర్ నాయక్, ప్రభాకర్ యాదవ్,ఇంద్ర రెడ్డి,బొబ్బిలి ఉమామహేశ్వర్, పత్తి నర్సింగ్ రావు, సురేందర్, సిద్దులు, రుక్మ రాజ్ , సతీష్ యాదవ్, ధయానంద్, మనోజ్ కుమార్, నరసింహ, బన్నీ,ఇమ్రాన్, అంజయ్య యాదవ్, రాజేష్ గౌడ్,ప్రభాకర్ గౌడ్, ప్రవీణ్, రఫిక్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు తదితరులు నాపాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఆశలన్ని రేవంత్ రెడ్డిపైనే.!

- **మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలి**
- **తెలంగాణ ఉద్యమకారుడు మల్లోజుల శ్రీనివాసచారి**



**ఇబ్రహీంపట్నం జులై 23 మహా:** ఉద్యమకారుల ఆశలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైనే ఆధారపడి ఉన్నాయని, ఎన్నికలలో ఇచ్చిన మేనిఫెస్టోను వెంటనే అమలు చేయాలని తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర కోశాధికారి మల్లోజుల శ్రీనివాస చారి కోరారు. తెలంగాణ రాష్ట్రం 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వేలాది మంది ఉద్యమకారులు, అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని అన్నాడు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కే.కే. కమిటీని ఏర్పాటు చేసి చర్చలు జరపడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఉద్యమకారులకు న్యాయం చేస్తుందనే ఆ శాభావం వ్యక్తం చేశారు. మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ కేసు లతో సంబంధం లేకుండా గుర్తింపు కల్పించాలని కోరారు తెలంగాణ ఉద్యమంలో అమరురాలైన బెల్లి లలితక్క మారోజు వీరన్న కోనపురి సాంబశివుడు రాములు మరి ఎంతోమంది ఉద్యమంలో పనిచేసి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించినటువంటి వారి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమైనాయి కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఈ అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుచున్నాను . ప్రతి ఉద్యమ కారునికి 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులను స్వరాష్ట్ర పోరాట యోధులుగా గుర్తించి నెలకు రూ.25 వేల పెన్షన్ మంజూరు చేయాలని అన్నారు. ఉద్యమ నాయకులపై నమోదైన కేసులను ఎత్తివేసి, జైలులో ఉన్న నాయకులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. మహిళ ఉద్య మకారులకు ప్రభుత్వ శాఖల్లో ప్రత్యేక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని, లేకపోతే మరో ఉద్యమానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడతాయని మల్లోజుల శ్రీనివాస్ చారి హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

- **విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి**
- **ప్రతినెల సమీక్ష సమావేశం నిర్వహించాలి**
- **జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్ ఐఏఎస్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఐఏఎస్, జిల్లా విద్యాదికారి శాఖలోని వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భౌతిక నమోదు పై చర్చిస్తూ, జిల్లాలోని మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో భౌతిక సమావేశం ఏర్పాటు చేసుకొని, విద్యార్థుల డేటాను తెప్పించుకొని త్వరితగతిన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల భౌతిక డేటాకు యుడైస్ లోని నమోదు సంఖ్యకు మధ్య గల తేడాపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రీ ప్రైమరీ పాఠశాలలో కేజీబీవీ పాఠశాలల్లో నమోదు పెంచాలని అన్నారు. ప్రతి మండల విద్యాధికారి తమ పరిధిలోని పాఠశాలలను సక్రమంగా పర్యవేక్షించాలని, కొన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గి జీరో పాఠశాలలుగా మారడానికి కారణాలు అడిగి ఉపాధ్యాయుల హాజరు శాతన్ని పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరులో ఎంఆర్సిలలోని సిఆర్పిల అటెండెన్స్ తక్కువగా ఉన్నదని తగు చర్యలు తీసుకోవలసినదిగా విద్యాశాఖ అధికారికి సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో సివిల్ వర్క్స్ గురించి సమీక్షించారు. అన్ని పాఠశాలలో టాయిలెట్స్ ఉండే విధంగా ప్రతి పాఠశాలలో దివ్యంగా విద్యార్థులకు ప్రత్యేక టాయిలెట్స్ నిర్మించవలసిందిగా తెలిపారు. జిల్లా అధికారులతో అనేక అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి నెలలో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తానని కాబట్టి అందరూ మండల విద్యాధికారులు తగిన డేటాతో హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సార్ కోఆర్డినేటర్స్, అందరూ మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- **వైద్య అధికారులకు కలెక్టర్ అంకిత్ సూచన**
- **రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** మాతా శిశు ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా గర్భిణీలు బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ అంకిత్ రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణ ఓపీ విభాగం ప్రసూతి వార్డులు లేబర్ రూమ్ శిశు వార్డు ఔషధ నిల్వ గది ఇతర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు అందుబాటులో ఉన్న సౌకర్యాలు రోగులకు అందిస్తున్న చికిత్సపై వైద్యులతో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిస్థితి వారికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు మందుల పంపిణీ పోషకాహార సదుపాయాలు ప్రసవాల సంఖ్య తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు రోగుల నమోదు వివరాలు ప్రసవాల రికార్డులు మందుల నిల్వలు విధి నిర్వహణ రికార్డులను పరిశీలించారు. వైద్యులు సిబ్బంది హాజరు నమోదును క్షుణ్ణంగా తనిఖీ చేసి విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి పేరు బాధ్యతల గురించి తెలుసుకున్నారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి అవసరమైన వైద్య సేవలను ఎలాంటి ఆలస్యం లేకుండా అందించాలని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సూచించారు. గర్భిణీలు బాలింతలు నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సేవలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రాంగణం వార్డులు మరుగుదొడ్లు తాగునీటి సదుపాయాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణం రోగుల ఆరోగ్యానికి ఎంతో అవసరమని ఆసుపత్రి పరిశుభ్రతపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులు నర్సులు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ పరిశీలనలో మా తాత ఆరోగ్య కేంద్ర వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్ అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలి

- **మణుగూరులో కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన...**
- **24 పోస్టులకు 751 దరఖాస్తులు..**
- **ఇప్పటివరకు 194 మంది సర్టిఫికెట్లు పరిశీలన..**
- **సీడీపీఓ జయలక్ష్మి వెల్లడి**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 24 అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోందని సీడీపీఓ జయలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీశ్రీనగర్ కాలనీలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. అంగన్వాడీ టీచర్ల పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ సాయంత్రం లోపు తప్పనిసరిగా సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుని, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలకు అనుగుణంగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని, జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకాలు చేయించి సమర్పించాలని తెలిపారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం తర్వాత సమర్పించే సర్టిఫికెట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అభ్యర్థులు ముందుగానే కార్యాలయానికి వచ్చి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని కోరారు. మణుగూరు ప్రాజెక్టు పరిధిలోని 24 అంగన్వాడీ టీచర్ పోస్టులకు మొత్తం 751 ఆన్‌లైన్ దరఖాస్తులు అందగా, ఇప్పటివరకు 194 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు సీడీపీఓ జయలక్ష్మి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్ స్ఫూర్తితో చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

- **మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**



**వరంగల్, మహా;** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి రామారావు జన్మదిన వేడుకలు గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిరాడంబరంగా జరిగాయి. ఆయన స్ఫూర్తిvతో వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని చిరు వ్యాపారులకు గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గొడుగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, ప్రజలకు అండగా నిలవడం, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడడం కేటీఆర్ రాజకీయ జీవన విధానమని అన్నారు. వారి జన్మదినం సందర్భంగా వారి ఆదర్శాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని నరేందర్ తెలిపారు.వర్షాకాలంలో చిరు వ్యాపారులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారికి ఉపయోగపడేలా గొడుగులను అందించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్ని, అన్ని వర్గాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు , బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎల్ నినో ప్రభావం పై ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్, మహా; ఎల్నినో ప్రభావంతో జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు, సాగునీరు, పశుగ్రాసం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ లో తన ఛాంబర్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైనా ప్రజలకు కనీస అవసరాలు నిరంతరాయంగా అందేలా అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని తెలిపారు.గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు, హ్యాండ్‌పంపులు, బోరుబావుల పనితీరును పరిశీలించి, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైతే తాగునీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు కూడా సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఫోడర్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని అంచనా వేసి రోజువారీ నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు .ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్,ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## పీవీ విజ్ఞాన కేంద్రం పనులను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, మహా;** హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం పరిశీలించారు.మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు స్వగ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు తుది దశకు చేరడంతో క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనులను పరిశీలించారు.విజ్ఞాన కేంద్రంలోని ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, ప్రాంగణంలో నాటిని మొక్కలు, నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు, తాగునీటి సౌకర్యాలు, నిర్వహణను కలెక్టర్ స్వయంగా పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుది దశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సృజన, కుడా సీపీవో అజిత్ రెడ్డి, డీఈ రఘు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**హనుమకొండ మహా ;** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాల (కిచెన్), తాగునీటి సౌకర్యాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై అధికారులను ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న విద్య, వసతి, ఆహారం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ తనిఖీలో తహసీల్దార్ రాజేష్, ఎంఈవో సునీతారాణి, ఎంపీడీవో వీరేశం, కేజీబీవీ ప్రత్యేకాధికారి జ్యోతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్, బ్యూరో మహా; భూముల రీసర్వే పనులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం నిర్వహించిన భూముల రీసర్వే అవగాహన సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే విధివిధానాలు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతి, లైసెన్స్ సర్వేయర్ల బాధ్యతల పై సమగ్రంగా సమీక్షించారు. లైసెన్స్ సర్వేయర్ల కు కేటాయించిన గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యతతో వ్యవహరించి, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో (సిఓఆర్ ఎస్) తో పాటు (క్యూ జి ఐ ఎస్) వంటి ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని, సర్వేయర్లు ఈ సాంకేతికత పై శిక్షణ పొంది నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. భూ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితమైన రికార్డులు రూపొందించాలని, రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి రీసర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. సంధ్యారాణి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంచాలకులు ఎం. శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఏ. రాజేంద్ర చారి, శాఖ అధికారులు, సిబ్బంది, లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి

- **భావన ఋషి సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు.**
- **హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను పట్టించుకోకుండా పనులు చేపట్టడంపై ఆందోళన.**

**కుషాయిగూడ, మహా** : కాప్రా డివిజన్ పరిధిలో భావన ఋషి కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన సర్వేనెంబర్ 158 లోని స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని భావన ఋషి సొసైటీ అధ్యక్షుడు సితాంజనేయులు డిమాండ్ చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ పరిధి దమ్మాయిగూడ భావన ఋషి కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన సర్వే నంబర్ 158లోని 2.10 గుంటల స్థలానికి సంబంధించి 2001 నుంచి వివిధ కోర్టుల్లో సాయిబాబా వెల్ఫేర్ అసోసియేషన్, రెవెన్యూ శాఖల మధ్య న్యాయ వివాదాలు కొనసాగుతున్నాయని సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు తెలిపారు.2009లో జీహెచ్ఎంసీ లేఅవుట్ ఆమోదం ఇచ్చిన మేరకు ఆ స్థలం సొసైటీ ఆధీనంలో ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ సొసైటీ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని, సొసైటీ నుంచి ఎలాంటి అక్రమ డబ్బులు ఇవ్వకపోవడంతో తమకు వ్యతిరేకంగా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో భాగంగా సర్వే నంబర్ 710గా బోర్డు ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఈ 2/1774/2025 ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యూ.పీ. నెం. 2225/2026లో 2026 జనవరి 27న స్టేటస్ కో ఆదేశాలు పొందామని తెలిపారు. ఆ ఆదేశాల ప్రకారం సర్వే నంబర్ 158 సర్వేనెంబర్ 710/1లకు సంబంధించిన స్థలంలో ఎలాంటి పనులు చేపట్టకూడదని చెప్పారు.అయితే తహసీల్దార్ సూచనల మేరకు విద్యుత్ శాఖ అధికారులు నిన్న, ఈరోజు జేసీబీలతో భూమి తవ్వించి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 25 ఏళ్లుగా కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో, అంతేకాక ఇళ్ల మధ్యలో సబ్ స్టేషన్ నిర్మించడం ప్రజల భద్రతకు ముప్పుగా మారుతుందని సీత ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు.హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను గౌరవిస్తూ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఇచ్చిన కేటాయింపును వెంటనే రద్దు చేసి, చేపడుతున్న పనులను నిలిపివేయాలని భావన ఋషి కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కోర్టు తీర్పు వెలువడే వరకు వివాదాస్పద స్థలంలో ఎలాంటి నిర్మాణ కార్యకలాపాలు చేపట్టవద్దని సంబంధిత అధికారులను సీత ఆంజనేయులు కోరారు.



# అనారోగ్యంతో విధులకు గైర్హాజరు..

- **మహిళా కార్మికురాలి తొలగింపు అన్యాయం..**
- **ఎస్ఎంఎస్ ప్లాంట్ యాజమాన్యం వెంటనే విధుల్లోకి తీసుకోవాలి..**
- **లేనిపక్షంలో ఆందోళన లు.. నిరాహార దీక్షలు చేపడతాం..**
- **రేణుక అక్షర మహిళా మండలి హెచ్చరిక..**

**మణుగూరు, మహా :** జీవనోపాధి కోసం ఎస్ఎంఎస్ ప్లాంటులో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు పగడాల గీత అనారోగ్యం కారణంగా కొద్ది రోజుల పాటు విధులకు హాజరు కాలేకపోయిందనే కారణంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించడం అమానుషమని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ విమర్శించారు. వెంటనే ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం మణుగూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రెక్కాడితే కానీ డొక్కాడని పేద మహిళా కార్మికురాలిపై ఎస్ఎంఎస్ ప్లాంట్ యాజమాన్యం కఠినంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. పగడాల గీతను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఎస్ఎంఎస్ ప్లాంట్ ఎదుట నిరాహార దీక్షలు చేపడతామని పూనెం సరోజ హెచ్చరించారు. ప్లాంట్‌లో కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ, వారిని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా స్థానికులను విస్మరించి స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించబోమని, అన్ని అక్రమాలను వెలికి తీసి ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి ఉపాధ్యక్షురాలు బొడ్డు సౌజన్య, ట్రెజరర్ ఎండి షబానా, ప్రధాన కార్యదర్శి రెడ్డిబోయిన రేణుక, నాయకులు కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నపురం వసంత, కన్నపురం శైలజ, బాడిశ పార్వతి, లక్కింశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు

# బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- **ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనకు ఆధునిక బోధనా పద్ధతులు అవసరం..**
- **మణుగూరులో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో డి వాసంతి..**



**మణుగూరు, మహా :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి వాసంతి సూచించారు. మణుగూరు మండలంలోని జెడ్పీ హెచ్ఎస్ కోఎడ్యుకేషన్ పాఠశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఉపాధ్యాయ వృత్త్యంతర శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆమె సందర్శించి శిక్షణ తరగతులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం కార్యక్రమం విజయవంతం కావాలంటే బోధనా విధానాల్లో నూతన పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో కనీస అభ్యాస సామర్థ్యాలు పెంపొందేలా, అక్షరాస్యతతో పాటు సంఖ్యాజ్ఞానం సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఆధునిక బోధనా విధానాలను సమర్థంగా వినియోగిస్తూ విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించాలని, పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో డి వాసంతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో), ఏఎంఓ, మండల రిసోర్స్ పర్సన్లు (ఎంఆర్పీలు), పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# యువత శక్తి నైపుణ్యంతో విజయం పొందాలి.!

- **యువ చైతన్య వేదికలో ఎమ్మెల్యే రంగారెడ్డి**
- **యువత మధ్యలో అభిషేక్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు**



**ఇబ్రహీంపట్నం జూలై 23 మహా:** యువ చైతన్య వేదికతో యువతకు శక్తి నైపుణ్యం విజయం అనే అంశాలపై అవగాహన కల్పిస్తూ, మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పుట్టినరోజు వేడుకను వారి మధ్యలో జరుపుకున్నారు. నేటి యువత మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాల బారిన పడకుండా, యువ చైతన్య వేదిక ద్వారా క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతూ సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తనయుడు, యువనేత మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల సర్కిల్ బొంగులూరు పరిధిలోని ప్రమిద గార్డెన్లో నిర్వహించిన కార్యక్రమంలో "మాదకద్రవ్యాల నిరోధక అవగాహన, శక్తి, నైపుణ్యం, విజయం అనే అంశంతో యువత తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఈ యొక్క యువ చైతన్య వేదిక ద్వారా యువతకు అవగాహన కల్పించారు.

**యువతను నైపుణ్యంతో తీర్చిదిద్దడమే లక్ష్యం...**

సాధారణంగా జన్మదినం అనగానే కేక్ కటింగ్‌లు, ఆర్భాటపు సంబరాలకే పరిమితమయ్యే సంస్కృతికి భిన్నంగా, అభిషేక్ రెడ్డి సామాజిక బాధ్యతతో ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేసి ప్రత్యేకత చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు అదనపు కలెక్టర్ రామచంద్రారెడ్డి, ఫ్యూచర్ సిటీ డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ హాజరై యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల మహమ్మారి ఒక్క వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలను, సమాజాన్ని పూర్తిగా నాశనం చేస్తుందని అధికారులు హెచ్చరించారు. యువత చదువు, క్రీడలు, కెరీర్‌పై దృష్టి సారించి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. సొంత పుట్టినరోజును సమాజ హితం కోసం, యువతలో చైతన్యం నింపేందుకు ఉపయోగించిన అభిషేక్ రెడ్డిని అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువత అభినందనలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో పలు కమిటీల చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి

- **భావన ఋషి సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు.**
- **హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను పట్టించుకోకుండా పనులు చేపట్టడంపై ఆందోళన.**

**కుషాయిగూడ, మహా :** కాప్రా డివిజన్ పరిధిలో భావన ఋషి కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన సర్వే నెంబర్ 158 లోని స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని భావన ఋషి సొసైటీ అధ్యక్షుడు సితాంజనేయులు డిమాండ్ చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ పరిధి దమ్మాయిగూడ భావన ఋషి కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన సర్వే నంబర్ 158లోని 2.10 గుంటల స్థలానికి సంబంధించి 2001 నుంచి వివిధ కోర్టుల్లో సాయిబాబా వెల్ఫేర్ అసోసియేషన్, రెవెన్యూ శాఖల మధ్య న్యాయ వివాదాలు కొనసాగుతున్నాయని సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు తెలిపారు. 2009లో జీహెచ్ఎంసీ లేఅవుట్ ఆమోదం ఇచ్చిన మేరకు ఆ స్థలం సొసైటీ ఆధీనంలో ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ సొసైటీ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని, సొసైటీ నుంచి ఎలాంటి అక్రమ డబ్బులు ఇవ్వకపోవడంతో తమకు వ్యతిరేకంగా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో భాగంగా సర్వే నంబర్ 710గా బోర్డు ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఈ 2/1774/2025 ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యూ.పీ. నెం. 2225/2026లో 2026 జనవరి 27న స్టేటస్ కో ఆదేశాలు పొందామని తెలిపారు. ఆ ఆదేశాల ప్రకారం సర్వే నంబర్ 158 సర్వేనెంబర్ 710/1లకు సంబంధించిన స్థలంలో ఎలాంటి పనులు చేపట్టకూడదని చెప్పారు. అయితే తహసీల్దార్ సూచనల మేరకు విద్యుత్ శాఖ అధికారులు నిన్న, ఈరోజు జేసీబీలతో భూమి తవ్వించి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 25 ఏళ్లుగా కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో, అంతేకాక ఇళ్ల మధ్యలో సబ్‌స్టేషన్ నిర్మించడం ప్రజల భద్రతకు ముప్పుగా మారుతుందని సీత ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను గౌరవిస్తూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇచ్చిన కేటాయింపును వెంటనే రద్దు చేసి, చేపడుతున్న పనులను నిలిపివేయాలని భావన ఋషి కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కోర్టు తీర్పు వెలువడే వరకు వివాదాస్పద స్థలంలో ఎలాంటి నిర్మాణ కార్యకలాపాలు చేపట్టవద్దని సంబంధిత అధికారులను సీత ఆంజనేయులు కోరారు.

# తెలంగాణకు గుండెచప్పుడు సింగరేణి: భట్టి



సత్తుపల్లి, మహా: సింగరేణి తెలంగాణకు గుండెచప్పుడని, 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థతో రాష్ట్ర ప్రజలకు భావోద్వేగ అనుబంధం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ గనిని గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు సంస్థలు, దిగుమతి బొగ్గు నుంచి పెరుగుతున్న పోటీని తట్టుకునేలా సింగరేణి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, అత్యుత్తమ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా ప్రతి లోడింగ్ పాయింట్ వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నాణ్యత లేని బొగ్గు సరఫరా వల్ల రవాణా వ్యయం పెరగడంతో పాటు విద్యుత్ ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. రాబోయే పదేళ్ల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సింగరేణి-జెన్‌కో కలిసి దీర్ఘకాల కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కొత్త కోల్ బ్లాకుల వేలాల్లో సింగరేణి చురుకుగా పాల్గొనేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భట్టి తెలిపారు. బొగ్గుతో పాటు సోలార్ విద్యుత్, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ వంటి కొత్త రంగాల్లోకి సంస్థ విస్తరించాలని పిలుపునిచ్చారు. సింగరేణిని లాభాల బాటలో నడిపిస్తూ భవిష్యత్ తరాలకు బలోపేతంగా అందించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం కిష్టారంలో నిర్మించిన సింగరేణి క్వార్టర్లను ఆయన ప్రారంభించారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

- **మోదీ దిష్టిబొమ్మ దహనం**
- **విద్యార్థులకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ**



**జూలూరుపాడు, మహా:** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్ అంబేద్కర్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టి, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం దారుణమన్నారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ పార్లమెంట్ సమావేశాల్లో విద్యార్థుల సమస్యలపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం ప్రధాని నివాసం ఎదుట శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని, దేశంలో ప్రతి పౌరుడికి ప్రశ్నించే స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం అప్రజాస్వామికమని విమర్శించారు. విద్యార్థుల ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులతో ఎస్సై జీనత్ కుమార్ మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు, చౌడం నరసింహారావు, లచ్చు నాయక్, రామిశెట్టి రాంబాబు, షేక్ మైబూబ్, కొలిపాక వెంకటేశ్వర్లు, మల్లెల నాగేశ్వరరావు, సపవట్ నరేష్, సర్పంచులు భూక్య చంద్రబాబు, బానోత్ మంగులాల్, అక్కల నరసింహారావు, బానోత్ కృష్ణ, బాదావత్ రాంబాబు, భూక్య ప్రసాద్, మాజీ ఎంపీటీసీ రాందాస్, లేళ్ల గోపాలరెడ్డి, యల్లంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ మౌలిక వసతుల పనులు వేగంగా పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ భాస్కరరావు**



భువనగిరి జూలై 23మహా : సింగన్నగూడెంలో డబుల్ బెడ్ రూమ్ గృహాల మౌలిక వసతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం 2బీహెచ్‌కే గృహ సముదాయంలో జరుగుతున్న మౌళిక వసతుల పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాలలో కరెంటు, త్రాగునీరు, పెయింటింగ్, మౌళిక వసతుల పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మిగిలిన మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు, మాదక దవ్యాల రవాణాపై గట్టి నిఘా



**యాదాద్రి భువనగిరి జూలై 23** మహాజిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.

గురువారం మినీ మీటింగ్ హల్ లో కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, అదనపు ఎస్పీ లక్ష్మి నారాయణ , సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, వాటి నిరోధానికి అవలంభించాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఒక్కటి,, పోలీస్ శాఖల అధ్వర్యంలో ఏడు కేసులు నమోదు చేయడం జరిగిందని, దాడులు, పట్టుబడిన గంజాయి నమోదైన కేసుల గురించి అధికారులు కలెక్టర్ కు వివరించారు. యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కమిటీగా ఏర్పడి పక్కాగా కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలను చైతన్యపరచేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలో డ్రగ్స్ పై కళాశాలలో అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఉన్న ప్రజలకు మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సజ్ సూపడెంట్ తుక్యానాయక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు: కలెక్టర్



**యాదాద్రి భువనగిరి, మహా:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్‌హెచ్ 65 జాతీయ రహదారి విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట అనుమతి లేని పార్కింగ్‌ను పూర్తిగా నియంత్రించాలని, రహదారులపై ఆక్రమణలు తొలగించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి తుక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**కారేపల్లి, మహా :** ఢిల్లీ పోలీసుల విద్యార్థులపై లాఠీచార్జ్ చేసి వారిపై కేసులను పెట్టటాన్ని నిరసిస్తూ గురువారం కారేపల్లిలో పిడిఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి.మస్తాన్, పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకి లు మాట్లాడుతూ ఉన్నత విద్యలో నెలకొన్న అవినీతి, పరీక్షల అక్రమాలు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సీజేపి ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన శాంతియుత ధర్నాపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం అన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కని, ఆ హక్కును అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ఉపయోగించడం హేయమైన చర్య అన్నారు. విద్యార్థులు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మోడీ ప్రభుత్వం అణచివేతకు పూనుకుంటుందని ఇది పరిష్కారం కాగ పోగా మరింత జఠిలం అవుతుందని హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని, వారిపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు గాంధీ, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, కారేపల్లి మండల కార్యదర్శి సంజయ్, చందు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# గాదెపాడుకు మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు

**కారేపల్లి, మహా:** గాదెపాడుకు ఖమ్మం నుంచి గురువారం నుంచి ఆర్టీసీ మధ్యాహ్నం అదనపు బస్సు సర్వీస్ ప్రారంభమైంది. దీంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ నెరవేరింది. ఇప్పటివరకు ఉదయం, రాత్రి మాత్రమే బస్సు ఉండగా, ఇప్పుడు మధ్యాహ్నం కూడా సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం 1 గంటకు ఖమ్మం నుంచి బయలుదేరే బస్సు 2.30 గంటలకు గాదెపాడు చేరుకుని, తిరిగి 4 గంటలకు ఖమ్మం చేరుతుంది. ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు ఈ సర్వీస్ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు

# బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన జోగ మల్లమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ సహకారంతో మంజూరైన 48 వేల రూపాయల సీఎం సహాయనిధి చెక్కును గురువారం స్థానిక సర్పంచ్ మూడ్ కిషోర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగన్ చేతుల మీదుగా బాధితురాలు మల్లమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పేదలు కూడా మెరుగైన వైద్యం పొందాలనే ఉద్దేశంతో, వారికి వైద్యం ఆర్థికంగా భారం కాకూడదని ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా బాధితులకు సహాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్మీరా ఈర్యా, సురేందర్ రెడ్డి ,బాణోత్ నవీన్, కుంజా రామకృష్ణ ,అజ్మీరా సుమన్, మూడ్ కిరణ్ పాల్గొన్నారు.





# విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే బలం

**దమ్మపేట, మహా:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేటలో నిర్వహించిన మూడు రోజుల మండల స్థాయి ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్, సామర్థ్యాధారిత బోధన, తరగతి గది నిర్వహణపై శిక్షణ విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులకు కల్పించిన సౌకర్యాలను ఎమ్మెల్యే అభినందించారు.

# అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి ముప్పు: జారె

**దమ్మపేట, మహా:** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనకు నిరసనగా దమ్మపేటలో కాంగ్రెస్ నేతలు చేపట్టిన ఆందోళనలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులను ఖండిస్తూ, అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని అణచివేయలేరని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలతో నిరుద్యోగ యువత భవిష్యత్తు దెబ్బతింటోందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# బీసీ గురుకులానికి సొంత భవనం కావాలి

**మణుగూరు, మహా:** మణుగూరులోని బీసీ బాలుర గురుకుల పాఠశాలకు వెంటనే సొంత భవనం నిర్మించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ డిమాండ్ చేశారు. ప్రహరీ గోడ లేక విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని, శాశ్వత భవనం కోసం స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని కోరారు. గురుకులాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జూలూరుపాడులో ముమ్మర వాహన తనిఖీలు

**జూలూరుపాడు, మహా:** జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ క్రాస్‌రోడ్‌లో పోలీసులు నాకాబంది నిర్వహించి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. పత్రాలు లేని, హెల్మెట్ ధరించని, నంబర్ ప్లేట్ లేని వాహనదారులకు జరిమానాలు విధించి, పెండింగ్ చలానాలు ఉన్న వాహనాలను నిలిపివేశారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీలక్ష్మి హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆమె సూచించారు.

# నాయకుని తండాలో ఘనంగా తీజ్ వేడుకలు

**యాదాద్రి భువనగిరి, మహా:** బొమ్మలరామారం మండలం నాయకుని తండాలో బంజారా సంప్రదాయాలకు ప్రతీకైన తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని తండా మహిళలు, యువతతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, గిరిజనుల సంస్కృతి పరిరక్షణతో పాటు తండాల సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సల్మాన్ పోస్టుతో వైరల్ పాత వీడియో

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఇటీవల నీట్ పేపర్ లీక్ వివాదంపై స్పందిస్తూ, ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సోషల్ మీడియా ద్వారా మద్దతు ప్రకటించారు. పేపర్ లీక్ వంటి ఘటనలు విద్యావ్యవస్థను దెబ్బతీస్తాయని పేర్కొంటూ, విద్యార్థుల శాంతియుత నిరసనను అభినందించారు. ఈ అంశానికి రాజకీయ రంగు పులమకుండా ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నిరసనల్లో గాయపడిన విద్యార్థుల పట్ల కూడా ఆయన సానుభూతి తెలిపారు.

అయితే ఈ పోస్టు తర్వాత సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో మళ్లీ వైరల్‌గా మారింది. 2020లో ప్రసారమైన 'ది కపిల్ శర్మ షో'లో సల్మాన్ తండ్రి, ప్రముఖ రచయిత సలీమ్ ఖాన్ చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

ఆ కార్యక్రమంలో సలీమ్ ఖాన్ సరదాగా మాట్లాడుతూ, తమ ఇంటికి తరచూ 'గణేష్' అనే వ్యక్తి వచ్చేవాడని, కుటుంబ సభ్యులంతా అతనికి ప్రత్యేక గౌరవం ఇచ్చేవారని చెప్పారు. ఆ తర్వాత అతనే పరీక్షల ప్రశ్నాపత్రాలు తీసుకొచ్చేవాడని హాస్యంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వేదికపై ఉన్న సల్మాన్ ఖాన్, అర్బాజ్ ఖాన్, సొహైల్ ఖాన్ నవ్వులు పూయగా, సల్మాన్ కూడా సరదాగా స్పందించారు. ఈ పాత వీడియోను ఇప్పుడు పలువురు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ విస్తృతంగా చర్చిస్తున్నారు.

# విజయ్ రాజకీయాల కోసమేనా 'జననాయకుడు'?

తమిళ స్టార్ హీరో విజయ్ రాజకీయాల్లోకి వెళ్లే ముందు చేసిన చివరి చిత్రం 'జననాయకుడు' విడుదలైన తర్వాత ఆసక్తికర చర్చకు దారితీసింది. బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి'కి ఇది రీమేక్‌గా ప్రకటించినప్పటికీ, అసలు కథలోని కొన్ని అంశాలు మినహా మిగతా భాగాన్ని పూర్తిగా మార్చేసినట్లు ప్రేక్షకులు చెబుతున్నారు. ముఖ్యంగా విజయ్‌ను రాజకీయ నాయకుడిగా ప్రతిష్ఠించేలా కథను మలిచారని అభిప్రాయపడుతున్నారు.సినిమా మొత్తం రాజకీయ సందేశాలు, అవినీతి వ్యతిరేక డైలాగులు, ప్రజలకు మార్పు అవసరాన్ని చెప్పే సంభాషణలతో నిండిపోయింది. ''నేను వస్తున్నా'', ''అవినీతి కార్యక్రమాలు ఆపేయండి'', ''ఓటర్లను తక్కువ అంచనా వేయొద్దు'' వంటి డైలాగులు విజయ్ రాజకీయ ప్రయాణానికి అనుసంధానంగా కనిపిస్తున్నాయని ప్రేక్షకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎంజీఆర్ ఆశీర్వాదం విజయ్‌కు లభించినట్లు చూపించిన సన్నివేశాలు కూడా చర్చనీయాంశమయ్యాయి.మహిళలు విజయ్‌కు మద్దతు తెలపడం, ప్రజల నాయకుడిగా చూపించే పాటలు, రాజకీయ నాయకులపై ఘాటైన సన్నివేశాలు వంటి అంశాలు సినిమా అంతటా కనిపిస్తాయి. దీంతో ఇది సాధారణ కమర్షియల్ చిత్రంగా కాకుండా విజయ్ రాజకీయ ఇమేజ్‌ను బలోపేతం చేసే ప్రయత్నంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే విజయ్ ఇప్పటికే రాజకీయాల్లో కీలక స్థానానికి చేరుకున్న నేపథ్యంలో ఈ సన్నివేశాల ప్రభావం తగ్గిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినీ, రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం ఈ అంశమే హాట్ టాపిక్‌గా మారింది.



# స్టైలిష్ లుక్‌తో మెరిసిన జియా శంకర్

రంగురంగుల పూల డిజైన్‌తో అలరారే పారదర్శక టాప్‌కు, అదే తరహా ఎర్రటి పుష్పాల ముద్రలతో ఉన్న మినీ స్కర్ట్‌ను జతచేసి నటి జియా శంకర్ ఆకట్టుకునే స్టైలిష్ లుక్‌లో కనిపించింది. సరస్సు ఒడ్డున ప్రకృతి అందాల నడుమ సన్‌గ్లాసెస్ ధరించి, చేతిలో స్టైలిష్ నేసిన బ్యాగ్‌తో ఆత్మవిశ్వాసంగా పోజులిచ్చింది. వెనుకనున్న తాటి చెట్లు, పచ్చని కొండలు, ప్రశాంత వాతావరణం ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

1995 ఏప్రిల్ 17న ముంబైలో జన్మించిన జియా శంకర్ చిన్న వయసులోనే నటనపై ఆసక్తి పెంచుకుని సినీ రంగంలో అడుగుపెట్టింది. 2013లో విడుదలైన తెలుగు రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఎంత అందంగా ఉన్నావే' ద్వారా సినీ ప్రవేశం చేసింది. అనంతరం తమిళ చిత్రం 'కనవు వరియం' (2017), 'హైదరాబాద్ లవ్ స్టోరీ' (2018) వంటి చిత్రాల్లో నటించి దక్షిణాది ప్రేక్షకులకు దగ్గరైంది. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.

జియా కెరీర్‌కు అసలైన మలుపు 2022లో విడుదలైన మరాఠీ బ్లాక్‌బస్టర్ 'వేద్' చిత్రం. రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా దేశ్‌ముఖ్‌లతో కలిసి ఆమె చేసిన నటనకు మంచి ప్రశంసలు లభించాయి. ఈ సినిమా ఘన విజయం ఆమెకు చిత్ర పరిశ్రమలో కొత్త అవకాశాల ద్వారాలు తెరిచింది. అనంతరం మరిన్ని ప్రాజెక్టులతో బిజీగా మారిన జియా తన ప్రతిభను మరింత విస్తరించుకుంది.

టెలివిజన్ రంగంలో కూడా జియా శంకర్ తనదైన ముద్ర వేసింది. 'మేరీ హానికారక్ బీవీ' సీరియల్‌లో డాక్టర్ ఇరా పాండే పాత్రతో ప్రేక్షకులను అలరించగా, 'కాటేలాల్ అండ్ సన్స్'లో సుశీల పాత్రలో తన హాస్య నటనతో మంచి గుర్తింపు పొందింది. 'పిశాచిని' సీరియల్‌లోనూ ఆకట్టుకున్న ఆమె, బిగ్‌బాస్ ఓటీటీ–2లో పాల్గొని దేశవ్యాప్తంగా మరింత ప్రజాదరణ సంపాదించింది. షోలో ఆమె చలాకీతనం, స్పష్టమైన వ్యక్తిత్వం అభిమానులను ఆకట్టుకున్నాయి.

ప్రస్తుతం జియా శంకర్ తమిళంలో కథానాయికగా నటిస్తున్న 'కాదల్ రీసెట్ రిపీట్' చిత్రం 2026లో విడుదలకు సిద్ధమవుతోంది. దక్షిణాది చిత్రసీమలో ప్రధాన కథానాయికగా నిలవాలన్న ఆమె కలకు ఈ చిత్రం కీలక అడుగుగా భావిస్తున్నారు. అందం, అభినయం, కష్టపడే తత్వం, విభిన్న పాత్రలను పోషించే సామర్థ్యంతో జియా శంకర్ టెలివిజన్ నుంచి వెండితెర వరకు విజయవంతమైన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఆమె రాబోయే చిత్రాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 565 రోజుల రికార్డు.. బాలయ్యకే సొంతం



తెలుగు సినీ పరిశ్రమలో నటసింహం నందమూరి బాలకృష్ణ ప్రయాణం ప్రత్యేకమైనది. ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఆయన సినీ కెరీర్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్లు, అరుదైన రికార్డులు నమోదయ్యాయి. మాస్ హీరోగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పరుచుకున్న బాలయ్య.. ప్రతి తరం ప్రేక్షకులను అలరిస్తూ విజయవంతంగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. కెరీర్ ముగిసిందని విమర్శలు వచ్చిన ప్రతిసారీ మరింత శక్తివంతమైన కంబ్యాక్ ఇస్తూ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించారు.

1960 జూన్ 10న మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు-బసవరామతారకం దంపతులకు జన్మించిన బాలకృష్ణ చిన్న వయసులోనే సినీరంగంలోకి అడుగుపెట్టారు. 1974లో విడుదలైన 'తాతమ్మకల' చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఆయన, అనంతరం తండ్రి ఎన్టీఆర్‌తో కలిసి 'దానవీరశూరకర్ణ', 'శ్రీమద్విరాటపర్వము', 'శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర', 'అన్నదమ్ముల అనుబంధం' తదితర చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందారు.

1984లో 'సాహసమే జీవితం'తో కథానాయకుడిగా మారిన బాలయ్యకు తొలి సినిమాలు ఆశించిన విజయాన్ని అందించలేదు. వరుసగా మూడు చిత్రాలు నిరాశపరచడంతో విమర్శలు ఎదురయ్యాయి. అయితే నాలుగో చిత్రంగా వచ్చిన 'మంగమ్మ గారి మనవడు' ఆయన కెరీర్‌ను ఒక్కసారిగా మలుపుతిప్పింది. ఈ చిత్రం సంచలన విజయాన్ని నమోదు చేసి ఏకంగా 565 రోజులపాటు థియేటర్లలో ప్రదర్శితమై తెలుగు సినీ చరిత్రలో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఆ విజయంతో బాలకృష్ణ స్టార్ హీరోగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుని, ఆ తర్వాత వరుస విజయాలతో నటసింహంగా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com